ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 43.0
కనిష్ఠం : 26.0

అశ్రు నివాళులు





కశ్మీర్‌లో పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ఆత్మశాంతి కలగాలని గురువారం జిల్లా వ్యాప్తంగా నివాళులర్పించారు. ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించగా నూజివీడు మండలం యనమదలలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు.



సుర్రుమన్న సూరీడు

ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటలకే ఎండల ధాటికి రోడ్లపై జనసంచారం ఉండడం లేదు. మధ్యాహ్నానికి పూర్తి నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరోవైపు ఉక్కబోతతో జనం అల్లాడుతున్నారు. ఏప్రిల్‌లోనే ఎండలు ఇలా ఉంటే రాబోయే మేలో ఇంకెంత తీవ్రంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.. ఎండ తీవ్రతకు గురువారం మధ్యాహ్నం ఏలూరు జూట్‌మిల్లు సెంటర్ ఇలా నిర్మానుష్యంగా కనిపించింది.

మూడు మద్యం దుకాణాలకు
రీ నోటిఫికేషన్

ఏలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏలూరు మండలంలో వివిధ కారణాల రీత్యా ఏర్పాటు కాని మూడు మద్యం దుకాణాలకు లైసెన్సులను జారీ చేయడానికి కలెక్టర్ ఆమోదంతో రీ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసినట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆవాల ఆవులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత గెజిట్ ప్రకారం 23,24,26 షాపులకు మే నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మే 4న దరఖాస్తుల పరిశీలించి 5న ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి ఎంపికైన వారికి లైసెన్సులు జారీ చేస్తామన్నారు. ఎంపికైన వారు 2024-2025 సంవత్సరానికి ఐదు నెలలు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, అనంతరం 2025-26 సంవత్సరానికి పూర్తికాల లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మద్యం దుకాణాలకు ఏ ప్రాంతానికి చెందిన వారైనా రూ.2లక్షల దరఖాస్తు రుసుమును డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చలానా రూపంలో మద్య నిషేధ, అబ్కారీ జిల్లా అధికారి, ఏలూరు వారికి చెల్లుబాటు అయ్యేలా చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్లు ఏలూరు, భీమడోలు, చింతలపూడి, పోలవరం, బుట్టాయగూడెం, పోలవరం, జంగారెడ్డిగూడెం, కైకలూరు, నూజివీడుల్లో స్వీకరిస్తామని తెలిపారు.

28 నుంచి 'ప్రైవేటు'లో ఒకటో తరగతి ఉచిత సీట్లకు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిలాలోని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను అర్హులైన పేద పిల్లలకు ఉచితంగా కేటాయించనున్నారు. దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 15లోగా ఆన్‌లైన్‌లో cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలని సూచించారు. నిర్దేశిత సంఖ్యలో సీట్లను పొందిన విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ సీట్లను రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయిస్తారని వివరించారు.

నేడు ఏపీఆర్‌ఎస్ క్యాట్, ఆర్‌జేసీ, ఆర్డీసీ ప్రవేశ పరీక్షలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ కామన్ అడ్మిషన్ టెస్టు (ఏపీఆర్‌ఎస్ క్యాట్), జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఏపీఆర్‌జేసీ టెస్టు, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌డీసీ పరీక్షలు శుక్రవారం జరగనున్నాయి. నగరంలోని సుబ్బమ్మదేవి మునిసిపల్ స్కూలు, కస్తూరిబా మునిసిపల్ బాలికోన్నత పాఠశాల, గాంధీనగర్ మునిసిపల్ హైస్కూలు, గవరవరం శ్రీచైతన్య స్కూలు, తూర్పువీధి కృష్ణదేవరాయ మునిసిపల్ హైస్కూలు, సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తారు. ఉదయం 10నుంచి 12 గంటల వరకు జరిగే ఏపీ ఆర్‌ఎస్ క్యాట్ పరీక్షకు 1,237 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఏపీఆర్‌జేసీ/ ఏపీ ఆర్‌డీసీ పరీక్షలకు 1,564 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షలకు జిల్లా కోఆర్డినేటర్‌గా ముసునూరు ఏపీ రెసిడెన్షియల్ స్కూలు ప్రిన్సిపాల్ ప్రవీణ, జిల్లా అబ్జర్వర్‌గా డీఆర్వో వ్యవహరిస్తారు.

దోమా..దోమా ఎందుకు కుట్టావ్ !

- ఏజెన్సీలో అధికంగా మలేరియా కేసులు
- అపరిశుభ్రత, అవగాహన లేమి ప్రధాన కారణం

■ లోపలి పేజీలో..

నేడు మలేరియా దినోత్సవం

సర్కారీ వైద్యం.. మెరుగ్గా!



జిల్లాలో ఆసుపత్రులకు మహర్దశ

- ఇకపై జిల్లా ఆసుపత్రిగా జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రి
- అన్ని ఆసుపత్రులలో ఎక్స్‌రే మిషన్లు, 24 గంటలు సేవలు
- అందుబాటులో కుక్కకాటు, పాము కాటుకు వ్యాక్సిన్లు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

జిల్లాలోని ప్రజలకు అందుబాటులో అన్ని రకాల వైద్య సేవలు కల్పించేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాలను అందించడానికి జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపించారు. ప్రతిపాదనలన్నీ ఆమోదం పొందితే జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందనున్నాయి.

ఏలూరు క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆసుపత్రిగా జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిని తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. గతంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిని జిల్లా ప్రభుత్వాసుపత్రిగా ఉండేది. దానిని మెడికల్ కాలేజీ టీచింగ్ ఆసుపత్రిగా మార్చి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో కలిపివేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుతం జిల్లా ఆసుపత్రి లేదు. పోలవరం ఏజెన్సీ గ్రామాలు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని ప్రజలు ఏలూరులోని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి రావాలంటే 60 నుంచి 100 కిలోమీటర్లు పైబడే దూరం ఉంటుంది. ఈ దృష్ట్యా ఏజెన్సీ ప్రాంతానికి, మెట్ట ప్రాంతానికి అందుబాటులో ఉండేలా జంగారెడ్డిగూడెంలో ఉన్న వంద పడకల ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా 350 పడకలతో తీర్చిదిద్దాలని నివేదికలను సిద్ధం చేశారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా కొనసాగించడానికి అక్కడ అవసరమైన ప్రత్యేక వైద్య సేవ విభాగాల ఏర్పాటుకు చర్యలను తీసుకోనున్నారు. జిల్లాలో ఉన్న సెకండరీ హెల్త్ ఆసుపత్రులన్నింటిలో ఎక్స్‌రే మిషన్లను ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు అత్యవసర విభాగాల్లో కూడా ఎక్స్‌రే తీయడానికి సిబ్బందిని నియమించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

● నూజివీడు ఆసుపత్రిలో ఇప్పటికే బ్లడ్ బ్యాంక్ భవనాన్ని అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అనుమతి రాగానే కొత్త భవనంలో ఈ బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురానున్నారు. అవసరమైన వైద్య పరికరాలను, ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారు.

● చింతలపూడి ఆసుపత్రి ప్రస్తుతం 50 పడకలు ఉండి కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రిగా ఉంది. జిల్లాకు ఒక ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ మంజూరు కావడంతో దానిని చింతలపూడిలోనే ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఐపీహెచ్‌ఎల్ లేబరేటరీలో ప్రత్యేక రక్తపరీక్షలు నిర్వహిస్తారు. లివర్ ప్రొఫైల్, థైరాయిడ్, వైరల్ టెస్టులు, కిడ్నీకి సంబంధించిన అన్ని రకాల పరీక్షలను నిర్వహించనున్నారు.

● దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రస్తుతం 30 పడకలు ఉండగా దానిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అక్కడ అదనపు వైద్య సేవలు అందించడానికి చర్యలను తీసుకోనున్నారు.

● భీమడోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల ఆసుపత్రిగా ఉంది. మరో 20 పడకలను అదనంగా ఏర్పాటు చేసి ట్రామా కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. జాతీయ రహదారి వెంబడి జరిగే రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులకు సత్వర వైద్య సేవలు అందించడానికి ఈ ట్రామాకేర్ యూనిట్ ఉపయోగ పడుతుంది.

● కైకలూరు ఆసుపత్రిలో ప్రస్తుతం 30 పడకలు ఉన్నాయి. అక్కడ ఎముకల శస్త్ర చికిత్స విభాగాలను అభివృద్ధి చేయడానికి సీయాం మిషన్, ఈఎన్‌టీ ఆపరేషన్లకు అవసరమైన యంత్ర పరికరాలు, మైక్రోస్కోప్, కంటి వైద్య పరికరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

● పోలవరం ఆసుపత్రిలో ప్రస్తుతం 30 పడకలు ఉన్నాయి. కొత్త భవనాల నిర్మాణం పూర్తవ్వగానే అదనపు ప్రత్యేక వైద్య విభాగాల సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే ఐటీడీఏ ద్వారా చిన్నపిల్లల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. న్యూ బోరన్ స్టెబిలేజింగ్ యూనిట్, బర్త్ వెయిటింగ్ రూమ్ వంటి వాటిని ఏర్పాటు చేయనున్నారు. ఏజెన్సీ ప్రజలకు అత్యవసర మందులు, పాముకాటు, కుక్కకాటు వ్యాక్సిన్లు నిల్వలను ఉంచడానికి చర్యలు చేపట్టారు.

● బుట్టాయిగూడెం ఆసుపత్రిలో 30 పడకలు ఉన్నాయి. పేషెంట్ వెయిటింగ్ హాల్, గర్భిణులకు వెయిటింగ్ హాలు, విశ్రాంతి రూముల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఐటీడీఏ సహకారంతో వీటిని నిర్వహిస్తారు. పాముకాటు, కుక్కకాటు వ్యాక్సిన్లుతో పాటు పురుగుమందు ఘాటుకు ఎవరైనా ప్రమాదానికి గురయితే వారికి త్వరగా వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక విభాగాలను సిద్ధం చేయనున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మార్చడానికి అదనపు వైద్య విభాగాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశాం. భీమడోలులో ట్రామాకేర్ యూనిట్‌కు ప్రతిపాదనలు పంపించాం. మిగిలిన ఆసుపత్రులలోను అవసరమైన వైద్య పరికరాలు, యంత్రాలు, అదనపు ప్రత్యేక విభాగాల ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి పంపించాం. అనుమతులు రాగానే యుద్ధ ప్రాతిపదికన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం.

- డాక్టర్ బి.పాల్ సతీష్‌కుమార్, వైద్య సేవల సమన్వయాధికారి

27 వరకు నీటి విడుదల

- గడువు పెంపు.. మంచినీటి పథకాలకు సమృద్ధిగా నీరు

ఏలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు తీవ్రత దృష్ట్యా ప్రజల మంచినీటి అవసరాల కోసం కాల్వల నీటి విడుదల గడువును పెంచారు. గోదావరి డెల్టాకు వాస్తవంగా ఈనెల 15వ తేదీతో గడువు ముగిసింది. అయితే పలు మంచినీటి పథకాల చెరువులు పూర్తిగా నిండలేదన్న ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర శాఖల విజ్ఞప్తులతో నీటి విడుదలను కొనసాగించారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రజలు అవసరాలకు, శివారు పొలాలకు నీటి అవసరాల కోసం రెండుసార్లు గడువులను పెంచడం విశేషం. మొదటగా ఈనెల 22 తేదీకి, ఆ తర్వాత ఈనెల 27 తేదీ వరకు గడువు పెంచారు. దీంతో మంచినీటి పథకాల్లోని చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాల అవసరాలకు విజ్జేశ్వరం నుంచి గోదావరి డెల్టాకు రోజుకు 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నట్టు ఏలూరు జలవనరుల శాఖ ఎస్‌ఈ పి. నాగార్జున తెలిపారు. 27వ తేదీ అర్ధరాత్రి తర్వాత గోదావరి డెల్టాకు నీటి విడుదలను అధికారికంగా నిలుపుదల చేస్తారన్నారు.

ఏలూరు కెనాల్‌కు నెలాఖరు వరకు..

మంచినీటి చెరువులను నింపుకునేందుకు ఏలూరు కెనాల్‌కు కృష్ణా డెల్టా నుంచి రోజుకు 1,200 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. ఈనెల 16వ తేదీ నుంచి నీటి విడుదల ప్రారంభించామని ఈ నెలాఖరు వరకు నీటి విడుదల జరుగుతుందని విజయవాడ జలవనరుల శాఖ ఎస్‌ఈ మోహన్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా ఏలూరు కార్పొరేషన్ అవసరాలకు కృష్ణా నీటి విడుదలతో పంపుల చెరువుల వద్ద ఉన్న మూడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను ఇంజనీరింగ్ అధికారులు నింపే పనుల్లో నిమగ్నం అయ్యారు. ఓ పక్క గోదావరి, మరోపక్క కృష్ణా నీటితో ఏలూరుకు మంచినీటి సమస్య తీరే అవకాశాలున్నాయి.

ఉద్యోగులుగా గుర్తించండి

- ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ డిమాండ్

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హెల్త్ మిషన్‌కు నిధుల కేటాయింపులు పెంచాలని ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోసమ్మ డిమాండ్ చేశారు. స్థానిక సీతారామభర్తియ కల్యాణ మండపంలో గురువారం జరిగిన ఆశా వర్కర్ల జిల్లా సదస్సుకు పి.కమల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పోసమ్మ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఏర్పడి ఇరవై ఏళ్ల అయిందని, ఆశా కార్యకర్తలు నిబద్ధతతో పనిచేస్తూ తల్లీపిల్లల మరణాలు తగ్గించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి గ్రాడ్యుటీ, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్‌ఐ, పెన్షన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.లింగరాజు, డి.ఎన్.వి.డి.ప్రసాద్, విమల, కె.విజయలక్ష్మి, లోకేశ్వరి, నవ్య, కామేశ్వరి, నాగదుర్గ, విజయలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పోసమ్మ

ప్రతీ నియోజకవర్గంలో ఇసుక స్టాక్ పాయింట్ : కలెక్టర్



ఏలూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జిల్లా అవసరాలకు అనుగుణంగా ప్రతీ నియోజకవర్గ పరిధిలో ఇసుకస్టాక్ పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ప్రస్తుత వేసవిలో నిర్మాణ పనులకు అనుకూలత, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇసుక స్టాక్ పాయింట్లను యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సుమారు నాలుగు ఎకరాల స్థలాన్ని ఇసుక స్టాక్ పాయింట్ కోసం ఎంపిక చేయాల్సి ఉంటుందని, ఏలూరు జిల్లాకు తూర్పు గోదావరి జిల్లాలోని తాడిపూడి రీచ్‌ను కేటాయించినందున అక్కడ నుంచి నియోజకవర్గస్థాయి ఇసుక స్టాక్ పాయింట్లకు వాహనాలను కేటాయిం చేందుకు ఏర్పాట్లు చేయాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. చేబ్రోల్ స్టాక్‌యార్డులో నిల్వ చేయడానికి ఇసుక సరఫరా చేసేందుకు 20 నుంచి 30 జీపీఎస్ అనుసంధానం కలిగిన వాహనాలను కేటాయించా లన్నారు. ప్రతీ నియోజకవర్గంలో స్టాక్ యార్డు ఏర్పాటుకు ఎండీఎల్ లైసెన్సుల జారీ కోసం వివిధ ఏజన్సీల నుంచి దరఖాస్తులు కోరేందుకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు తెలిపారు. చేబ్రోలు స్టాక్ పాయింట్‌కు తహసీల్దార్ కస్టోడియన్‌గా వ్యవహరిస్తారన్నారు. గూటాలలోని రెండు డీసిల్టింగ్ పాయింట్లకు జంగారెడ్డిగూడెం ఆర్డీవో, చేబ్రోలు స్టాక్ పాయింట్‌కు ఏలూరు ఆర్డీవో పర్యవేక్షించాలన్నారు. కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల స్టాక్ పాయింట్లకు ఇసుక సరఫరాకు సమీప కృష్ణాజిల్లా పరిధిలోని ఇసుక రీచ్‌లను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, గనులశాఖ డీడీ రవికుమార్, ఆర్డీవో కృష్ణారావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజు, జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ, డీపీవో అనురాధ, జంగారెడ్డి గూడెం ఆర్డీవో మదానీ పాల్గొన్నారు.

• సప్లిమెంటరీలో సత్తా చూపండి..

ఏలూరు అర్బన్ : పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ప్రతికూల ఆలోచనలతో కుంగిపోకుండా మే 19 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు ఆత్మ శ్వాసంతో సిద్ధపడితే ఉత్తీర్ణత సాధించడం సులువేనని కలెక్టర్ వెట్రిసెల్వి హితబోధ చేశారు. పరీక్షల ఫలితాలపై గురువారం సాయంత్రం సమీక్షించిన ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఫెయిలైన 5091మంది బాలబాలికలు నిరాశ, నిస్పృహలకు గురి కాకుండా ఉండేందుకు స్కూలు ప్రధానోపాధ్యాయులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. సంబంధిత విద్యార్థులకు వెంటనే పునశ్చరణ తరగతులను ప్రారంభించాలని ఆదేశించారు.

గంజాయిని అరికడతాం : ఐజీ



కైకలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక నిఘాలను ఏర్పాటు చేస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. కైకలూరు రూరల్ పోలీసుస్టేషన్లో గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. 'ఇప్పటికే గంజాయిని చాలావరకు అరికట్టాం. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో ఎక్కడా గంజాయి విక్రయాలు లేకుండా కట్టడి చేయగలుగుతున్నాం. సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. ఏడాదిలోగా ఆరు వేల మంది సిబ్బంది నియామకం చేపడతాం. ఆరు జిల్లాల్లో 22 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. డ్రోన్ కెమెరాలతో రాత్రి సమయాల్లోను పర్యవేక్షిస్తున్నాం. మహిళల రక్షణ కోసం శక్తియాప్‌ను ప్రవేశ పెట్టాం. కైకలూరులో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తాం' అన్నారు. సమావేశంలో ఎస్పీ కె ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐలు పాల్గొన్నారు.

కోనేరులో పడి పాప మృతి

కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద విషాదం

■ లోపలి పేజీలో..



ఆక్వా రైతులకు అండగా..

- పాతపద్ధతిలో.. ఆక్వాజోన్‌లోకి చెరువులు
- రీసర్వే ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు
- 30లోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కైకలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం జోన్, నాన్ ఆక్వాజోన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేతో ఆక్వారంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది. రైతులకు కొత్తగా ఎల్‌పీ నెంబర్లు ఏర్పాటు చేయడంతో ఆక్వా జోన్‌లోని చెరువులు సైతం నాన్ ఆక్వాజోన్ పరిధిలోకి వెళ్లడంతో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు రాకపోగా మత్స్యశాఖ అనుమతులు సైతం నిలిపివేశారు. ఈనెల 7న 'రీసర్వే చిక్కులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. సమస్యను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ లోపు అర్హత కలిగిన ఆక్వాజోన్ విస్తీర్ణాన్ని గుర్తించి ఆన్‌లైన్ చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించింది. రీసర్వే వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4 లక్షల ఎకరాలు చేపల, రొయ్యల చెరువులు ఆక్వాజోన్ నుంచి నాన్ ఆక్వాజోన్‌లోకి వెళ్లిపోగా ఒక్క కైకలూరు నియోజకవర్గంలో 50 వేల ఎకరాలు, ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 2.5 లక్షల ఎకరాలు నాన్‌ఆక్వాజోన్ పరిధిలోకి వెళ్లాయి.

ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం ఆధారంగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందిస్తూ ప్రభుత్వం డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ ద్వారా ఈ నెల 30వ తేదీ లోపు స్థానిక మత్స్యశాఖ అధికారుల నుంచి ఎల్‌పీ నెంబర్లు లేకుండా ప్రతీ రైతుకు ఆక్వాజోన్ అనుమతులు మంజూరు చేసేందుకు ఆన్‌లైన్ డేటా ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించింది. దీంతో పాత పద్ధతిలోనే ఆక్వాజోన్ పరిధిలోకి అన్ని చెరువులు వస్తాయి. దీనివల్ల రైతులకు మత్స్యశాఖ అనుమతులు ప్రభుత్వం నుంచి విద్యుత్ సబ్సిడీ, ఇతర పథకాలు యథావిధిగా రైతులకు అందనున్నాయి. టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సూక్ష్మ సేద్యానికి మోక్షం

బిందు, తుంపర సేద్యానికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం

వైసీపీ ప్రభుత్వంలో నిధులు లేక మూలకు..

టీడీపీ ప్రభుత్వం రాకతో జవసత్వాలు

ఈ ఏడాది లక్ష్యం 8,500 హెక్టార్లు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన బిందు, తుంపర్ల సేద్యానికి టీడీపీ ప్రభుత్వం రాకతో జవసత్వాలు వచ్చాయి. రైతులు తమ పంట పొలాల్లో డ్రిప్ (బిందు), స్ప్రింకర్లు (తుంపర్ల)ను ఏర్పాటు చేసుకోవడంతో ఎక్కువ విస్తీర్ణానికి సాగు నీటి అవసరాలు తీరడంతో పాటు దిగుబడులు కూడా గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రెండు సంవత్సరాల పాటు ఎటువంటి నిధులు కేటాయించక పోవటంతో పాటు ఈ డ్రిప్, స్ప్రింకర్లకు సంబంధించిన ఏజెన్సీలకు బకాయిలు చెల్లించక పోవటంతో గతంలో మంజూరైన వాటికి కూడా ఈ పరికరాలు బిగించలేని పరిస్థితులు ఎదురయ్యాయి. మళ్లీ బిందు, తుంపర్ల సేద్యానికి లక్ష్యాలను నిర్ధేశించు కోవటం జరిగింది. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి జిల్లాలో 8,500 హెక్టార్లను భౌతిక లక్ష్యంగా నిర్ధేశించు కున్నారు.దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ప్రారంభించారు. ఏలూరు జిల్లాలో 2003-04 నుంచి ఇప్పటివరకు జిల్లాలో అమలు అయిన విస్తీర్ణం 1,15,239 హెక్టార్లు కాగా 93,003 మంది రైతులు లబ్ధి పొందారు. సూక్ష్మసేద్య పథకం అమలుకు 84 వేల 810 హెక్టార్లు అందుబాటులో ఉంది. 2024-25 సంవత్సరంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఈ పథకానికి ఊతం ఇవ్వడంతో 7 వేల హెక్టార్ల విస్తీర్ణాన్ని లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. దీనికి సంబంధించి రూ.45.76 కోట్లు కేటాయించారు. జిల్లాలో ఆ ఏడాది 6644.85 హెక్టార్లలో 6227 మంది రైతులకు ఈ సేద్యంలో పరికరాలు ఇవ్వగా దీనికి రూ.47.93 కోట్లు కేటాయించారు.



ద్వారకాతిరుమల మండలం నాగులాపల్లిలో బిందు సేద్య పద్ధతిలో దొండ పాదుల సాగు

రైతులకు సబ్సిడీ

ఎస్సీ/ఎస్టీ చిన్న సన్నకారు రైతులకు 5 ఎకరాల వరకు 100 శాతం సబ్సిడీ, చిన్న ,సన్నకారు రైతులకు 5 ఎకరాలకు మించకుండా 90 శాతం రాయితీ, మధ్యతరహా రైతులకు 5 ఎకరాల నుంచి 10 ఎకరాలకు మించకుండా 70 శాతం రాయితీ, పెద్ద రైతులకు 50 శాతం రాయితీ పొందే అవకాశం కల్పించారు. చిన్న, సన్నకారు, పెద్ద రైతులందరికీ 50 శాతం రాయితీగా అందిస్తారు. బిందు , తుంపర్ల సేద్యానికి సంబంధించి పరికరాలు ప్రభుత్వ రాయితీపై పొందగోరు రైతులు ఆధార్ కార్డ్, భూమి యాజమాన్య పత్రం, జతచేసి సంబంధిత మండల ఉద్యాన శాఖాధికారి/ గ్రామ ఉద్యాన సహాయకుడు/ గ్రామ వ్యవసాయ సహాయకుడు /గ్రామ సెరీకల్చర్ సహాయ కుడు /సూక్ష్మ నీటి పారుదల ప్రాంత అధికారులతో గాని లేక సంబంధిత గ్రామ రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్కె) లేదా జిల్లా మైక్రో ఇరిగేషన్ కార్యాలయం, ఏలూరు నందు బయోమెట్రిక్ ద్వారా నమోదు ప్రక్రియ చేసుకోవచ్చు.

అర్హులైన దరఖాస్తుదారులు తోట/ పొలమును వారు ఎంపిక చేసుకున్న సూక్ష్మ సేద్య కంపెనీ ప్రతినిధులు, రైతు సేవా కేంద్ర సహాయకుల క్షేత్ర సందర్శన చేసి సూక్ష్మ సేద్య డిజైన్ అంచనా తయారు చేసిన తర్వాత రైతు చెల్లించవలసిన వాటాను వారి సెల్‌ఫోన్‌కు సందేశం వస్తుంది. ఆ మొత్తాన్ని పీడీ ఏపీఎంఐపీ వారికి చెల్లించిన తరువాత దరఖాస్తును పరిశీలించి కలెక్టర్ నుంచి పరిపాలనా అనుమతి పొందిన తరువాత ఆయా రైతులకు వారి తోట/పొలంలో సూక్ష్మ సేద్య పరికరాలను సరఫరా చేసి సంబంధిత కంపెనీ సాంకేతిక నిపుణుల ద్వారా బిగిస్తారు...



కొయ్యలగూడెం మండలం వేదాంతపురంలో తుంపర సేద్యం

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

ఏపీ సూక్ష్మ సేద్య పథకంలో 2025-26 సంవత్సరానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అయింది. ఈ ఏడాది జిల్లాలో 8,500 హెక్టార్లు లక్ష్యంగా నిర్ధేశించుకోవటం జరిగింది. ఈ డ్రిప్ / స్ప్రింక్లర్లు ప్రభుత్వ రాయితీపై పొందటానికి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఆ దరఖాస్తులను పరిశీలించి పరికరాలను అందించటం జరుగుతుంది. రైతులు ఈ విషయాన్ని గమనించి బిందు, తుపంర్ల సేద్యాన్ని వినియోగించుకోవాలి.



రవికుమార్, ఏపీఎంఐపీ, పీడీ , ఏలూరు జిల్లా



వేసవి మండుతోంది.ఎండ దెబ్బకు మనుషులే కాదు.. పశు పక్ష్యాదులు కూడా అల్లాడిపోతున్నాయి..ఎక్కడ చల్లదనం ఉంటే అక్కడ వాలిపోతున్నాయి.. ఎందుకంటే మనలా ఏసీలు, ఫ్యాన్‌లు ఉండవు కదా.. వేసవి వస్తే తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు అంకాలమ్మ చెరువులో పరిసర ప్రాంతాల పశువులు ఇలా సేదతీరుతుంటాయి.. - తాడేపల్లిగూడెం రూరల్

నేటి నుంచి కొంతేరులో నాటిక పోటీలు

యలమంచిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో యూత్‌క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో 43వ అఖిలభారత స్థాయి నాటిక పోటీలను ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి మురళీకృష్ణ, గంటా ముత్యాలరావు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో పరిషత్ మురళీకృష్ణ మాట్లాడుతూ అఖిల భారతస్థాయి నాటిక పోటీలను 43 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నా మని తెలిపారు. 25వ తేదీన కృష్ణ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ వారి 'ద్వారబంధాల చంద్రయ్య నాయుడు', విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్(హైదరాబాద్) 'స్వేచ్ఛ', 26వ తేదీన యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ 'నా శత్రువు', శ్రీఅభ్యుదయ ఆర్ట్స్ (విజయవాడ)వారి 'ఆంగికం భువనం యస్య', శ్రీసాయి ఆర్ట్స్ (కొలకలూరు)'జనరల్ బోగీలు', 27వ తేదీన శ్రీసౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి 'దేవ రాగం', శ్రీనటీనట సంక్షేమ సమాఖ్య (పాల కొల్లు) 'అనూహ్యం' నాటి కలను ప్రదర్శి స్తారని వివరించారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.



నాటిక పోటీలకు సిద్ధమైన కళావేదిక



కల్యాణ మహోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

మే 6 నుంచి కాళ్ళకూరు వెంకన్న కల్యాణోత్సవాలు

కాళ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి వార్షిక సప్తాహ్నిక తిరు కల్యాణ మహోత్సవాలు మే 6వ తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవాల వాల్ పోస్టర్లను ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఆవిష్కరించారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు, దాట్ల వెంకటరామరాజు, వేద పండితులు అనిపెద్ది ఫణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీనివాసుని గరుడోత్సవం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గరుడ వాహనంపై ఉభయదేవేరులతో కొలువు దీరిన శ్రీనివాసుడు ఆలయం నుంచి సమీప గ్రామం వరకూ అట్టహాసంగా ఊరేగారు. ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురంలోని పురాతన ఆలయంలో జరుగుతున్న శ్రీనివాసుని కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గరుడోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు వైఖానస ఆగమయుక్తంగా వైభవంగా జరుగుతున్నాయి.ఉదయం విశేష పూజలు నిత్యహోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ముందుగా పల్లకి వాహనంలో ఉంచి గరుడవాహనం ఉన్న ప్రాంతానికి తీసుకువచ్చారు.తరువాత గరుడవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి తీసుకు వెళ్లారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట భజనలు, వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారు తిమ్మాపురం చేరుకోగానే దేవదేవునికి అక్కడి భక్తులు ఘనస్వాగతం పలికి, హారతులు సమర్పించారు.



గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు.

ఘనంగా చల్లాలమ్మ ప్రతిష్ఠ మహోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం గ్రామదేవత చల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, కేరళ డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన చేశారు.



దోమా..దోమా ఎందుకు కుట్టావ్ !



ఏజెన్సీలో అధికంగా మలేరియా కేసులు

ఏజెన్సీలో దోమ కుట్టిందో మంచం ఎక్కాల్సిందే. పశ్చిమ ఏజెన్సీలో అంతటి పవర్ ఫుల్ దోమలు ఉంటాయి మరి. కుట్టిన దోమ ఏదో తెలియాలంటే వెంటనే రక్తపరీక్షలు తప్పవు. దోమ కుట్టడం వల్ల వచ్చిన రోగం ఒక పట్టాన వదలి పెట్టిపోదు. ఆసుపత్రులు చుట్టూ తిరగాలి. అదృష్టం ఉంటే వచ్చిన రోగం వెంటనే బయటపడుతుంది.లేదంటే రోజుల తరబడి ఆసుత్రులకు తిరగడం తప్పదు. ఇటువంటి కేసులు ఏజెన్సీలో నిత్యకృత్యం. నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తీసుకోవలిసిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం

అపరిశుభ్రత, అవగాహన లేమి ప్రధాన కారణం

అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ముప్పు

ముందస్తు జాగ్రత్తలతో అదుపు

నివారణ చర్యల్లో అధికారులు

నేడు మలేరియా దినోత్సవం

బుట్టాయగూడెం, (ఆంధ్రజ్యోతి)

78 గ్రామాల్లో అత్యంత సమస్యాత్మకం

కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, ఏలేరుపాడు ఐదు ఏజెన్సీలో మండలాలు ఉన్నాయి. ఐదు మండలాల్లో 402 రెవెన్యూ గ్రామాలు ఉండగా 153 మలేరియా కేసులు నమోదయ్యే గ్రామాలుగా అధికారులు గుర్తించారు. వీటిలో 78 గ్రామాలను అత్యంత సమస్యాత్మక మలేరియా గ్రామాలు గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. 2023లో 183 మలేరియా కేసులు నమోదు కాగా అందులో 159 కేసులు ఏజెన్సీలోనే ఉన్నాయి. 2024లో 93 కేసులు నమోదు కాగా 80 కేసులు ఏజెన్సీలో ఉన్నాయి. 2025 జనవరి నుంచి ఏప్రిల్ వరకు 40 మలేరియా కేసులు నమోదు కాగా 38 కేసులు ఏజెన్సీ ప్రాంతంలోనే నమోదయ్యాయి. గతంతో పోలిస్తే కేసులు తగ్గుముఖం పట్టడం మంచి పరిణామమని చెప్పవచ్చు.



కెఆర్ పురంలో మలేరియా కార్యాలయం

మలేరియా జ్వరాలు వర్షాలు ప్రారంభమయ్యాక వస్తుం టాయి. ఆడ ఎనాపిలిస్ దోమ కుట్టడం వలన మలేరియా వస్తుంది. వర్షాలు కురిసి ఆగిపోయిన తర్వాత నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమ గుడ్లు పెడుతుంది. అటవీ ప్రాంతంలో చెట్లు అధికంగా ఉండటం వల్ల వర్షాలు తర్వాత నీరు ఆకుల్లోను, కాల్వల్లోను నిల్వ ఉండటంతో దోమలు పెరిగే అవకాశాలు ఎక్కువ. ఆడ ఎనాపిలిస్ దోమ రాత్రిపూట 9 నుంచి తెల్లవారుజామున 4 గంటల మధ్యలో కుడుతుంది. అటవీ ప్రాంతాల్లోనివారు, అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉంటున్నవారు తరుచుగా మలేరియా భారిన పడుతున్నారు.

అశ్రద్ధ చేస్తే డేంజర్

పశ్చిమ ఏజెన్సీలో అటవీ ప్రాంతం అధికంగా ఉండటంతో మలేరియా జ్వరాలు కూడా అధికంగానే నమోదు అవుతున్నాయి. గిరిజనులు ప్రతిరోజు ఏదో ఒకపనిపై అడవికి వెళ్లి వస్తుంటారు. వీరికి తెలియకుండానే దోమకాటు భారిన పడతారు. కుట్టింది ఏ దోమ తెలియాలంటే కొన్ని రోజులు ఆగక తప్పదు. దోమ కుట్టిన తర్వాత వచ్చే లక్షణాలను బట్టి రక్త పరీక్షలు చేయించుకుని మందులు వాడితే పర్వాలేదు. లేకుంటే మలేరియా భారినపడక తప్పదు. మలేరియాను అశ్రద్ధ చేస్తే కామెర్లు, డెంగీ భారీనపడే ప్రమాదాలు లేకపోలేదు. సకాలంలో వైద్యం అందకపోతే మరణాలు కూడా జరుగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఏటా 40 టన్నుల మలాథియాన్ స్ప్రే

మలేరియా కేసులను నివారణించడానికి ఏటా 40 టన్నుల మలాథియాన్ దోమల మందును ఏజెన్సీలో వాడుతున్నారు. ఏజెన్సీలో 15 ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలు, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 78 సబ్ సెంటర్లు పని చేస్తుండగా వైద్యులు, సిబ్బంది నిత్యం మలేరియా నివా రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సంవత్స రంలో మూడు సార్లు మలేరియా నివారణకు మలాథియాన్ దోమలమందును గ్రామాల్లో స్ప్రేయింగ్ చేస్తారు.45 రోజులకు ఒకసారి స్ప్రేయింగ్ చేస్తారు. ముంపు మండ లాలైన కుక్కునూరు, ఏలేరుపాడు మండలాల్లో 60 లీటర్లు ఏసీఎం మందును సంవత్సరంలో రెండుసార్లు స్ప్రేయింగ్ చేస్తారు.

నివారణ చర్యలు



జిల్లాలో మలేరియా జ్వరాల నివారణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నాం. నివార ణకు ఏటా మూడుసార్లు దోమల మందు స్ప్రే చేయిస్తున్నాం. మే 1వ తేదీన మొదటి విడత, 45 రోజల వ్యవధిలో రెండు సారు స్ప్రేయింగ్ పనులు చేస్తాం. మలేరియా కేసులు నమోదైతే వెంటనే నివారణ చర్యలు తీసుకుంటున్నాం. కేసులను వెంటనే గుర్తించడానికి వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆర్‌డీ కిట్లను అందుబాటులో ఉంచాం. జ్వరం వచ్చినవారికి రక్తపరీక్ష చేస్తే 10 నిమి షాల్లో ఫలితం తెలుస్తుంది. మలేరియా అని తెలితే వెంటనే కోర్సు ప్రారంభిస్తాం.అటవీ ప్రాంతాల్లోనివారు సాయంత్రం కాగానే తలుపులు, కిటికీలు మూసివేయాలి. ఒంటి నిండా దుస్తులు ధరించాలి. నీరు నిల్వ ఉండ కుండా చూసుకోవాలి. చలిజ్వరం వస్తే వెంటనే డాక్టరును సంప్రదించి మందులు వాడాలి.

- పీఎస్ఎస్ ప్రసాద్, ఏలూరు జిల్లా మలేరియా అధికారి



రావి, వేప చెట్టుకు కల్యాణం

పాలకొల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు యడ్లబజారు కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న రావిచెట్టు, వేప చెట్టుకు గురువారం కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. పట్టణానికి చెందిన కుప్పిలి ధర్మాచార్యులు విజయలక్ష్మి దంపతులు, కుప్పిలి వెంకన్న దుర్గ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. రావి చెట్టును శ్రీమన్నారాయుణుడిగా, వేప చెట్టును శ్రీమహాలక్ష్మిగా భావిస్తూ కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

రేపు ఓపెన్ చెస్ టోర్నమెంట్

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మేడే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న ఏలూరు సీపీఐ కార్యాలయంలో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.కృష్ణమా చార్యులు, జిల్లా నాయకుడు కిషోర్ తెలిపారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఓపెన్ చెస్‌కు సంబంధించిన పోస్టర్స్ ఆవిష్కరించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు.



సినీనటుడు రావు రమేష్‌కి ఆత్మీయ చైతన్య పురస్కారంతో సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి, చైతన్యభారతి సభ్యులు

నాటక రంగాన్ని బతికించుకుందాం

భీమవరం పరిసర ప్రాంతంలో త్వరలోనే కళావేదిక ఏర్పాటు

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

ఘనంగా చైతన్య భారతి జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నాటకాలతో సమాజంలో మార్పు వస్తుందని.. నాటక రంగాన్ని బతికించుకుందామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. త్వర లోనే భీమవరానికి దగ్గరలో కళావేదిక ఏర్పటు చేస్తామని చెప్పారు. భీమవరం డీఎన్ఆర్ కళాశాల గన్నబత్తుల క్రీడా ప్రాంగణంలో చైతన్య భారతీ సంగీత, నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలను గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సినీనటుడు రావు రమేష్‌కు ఆత్మీయ చైతన్య పురస్కారం, సినీనటుడు, రచయిత మిశ్రాకు చుక్కన సత్యనారాయణరాజు రంగస్థల చైతన్య పురస్కారం, నటీమణీ మణిబాలకు పెనుపోతుల శేషగిరి రంగస్థల చైతన్య పురస్కారాలతో సత్కరించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ మాట్లాడుతూ అప్పట్లో రాజులు కళలను ఆదరించేవారని ఇప్పుడు ప్రభుత్వాలు సహకారం అందించాలన్నారు. నాటక రంగాన్ని బతికించడానికి చైతన్య భారతి లాంటి కళాపరిషత్‌లు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి ప్రమాణికంగా నిలిచేవి నాటికలే అన్నారు. డిజిటల్ కాలంలో నాటకరంగాన్ని రక్షించడం కోసం పరిషత్ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. రావు రమేష్ మాట్లాడుతూ ఇక్కడ ప్రజల ఆత్మీయ అభిమానం మరువలేనిదన్నారు. అనంతరం నాటక ప్రదర్శనలు ప్రారంభించారు. కళానికేతన్ కాట్రపాడు వారిచే కిడ్నాప్, మైత్రి కళానిలయం హైదరాబాద్ వారి బ్రహ్మ స్వరూపం నాటక ప్రదర్శనలు జరిగాయి. డీఎన్ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, చిలుకూరి నరసింహరాజు,మంతెన రామ్‌కుమార్ రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, పెన్నాడ శ్రీను, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, తదితరులు పాల్గొన్నారు.



హోటల్స్‌లో తనిఖీ చేస్తున్న ఆహార జిల్లా అధికారి

రెస్టారెంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో గల జువ్వలపాలెం రోడ్డులో అదుర్స్ రెస్టారెంట్లో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆహార భద్రత అధికారి ఏఎస్ రెడ్డి తనిఖీలు చేశారు. ఆహారం, ఆహార పదార్థాల మెటీరియల్ క్షుణ్ణంగా పరిశీలించారు. చికెన్ నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా వినియోగిస్తున్నట్టు గమనించి, దానిని పరీక్షల నిమిత్తం స్టేట్ ఫుడ్ లాబరేటరీకి పంపించినట్టు తెలిపారు. రెస్టారెంట్లలో వినియోగించే నూనెను పలుసార్లు మరిగించి వినియోగిస్తే అది విషంగా మారుతుందని తెలిపారు. టీపీసీ మీటర్ ద్వారా క్వాలిటీ నిర్ధారించి హోటల్ యజమానులను హెచ్చరించారు. అక్కడ నిల్వ ఉన్న నూనెను ఒక క్యాన్‌లో నిల్వ ఉంచి దాన్ని ఏజెన్సీ వారికి అప్పజెప్పాలని సూచించారు. ఆహార భద్రతా నియమాలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారి లైసెన్స్ క్యాన్సిల్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని రెడ్డి హెచ్చరించారు.




గంగడపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి.. చింతదిబ్బలో ఎక్స్‌కవేటర్ నడుపుతున్న నిమ్మల

ఇంటింటికీ తాగునీరు : మంత్రి నిమ్మల

యలమంచిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు నియోజకవర్గంలో రూ.80 కోట్ల నిధులతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రజలకు ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్టు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. 'మన రైతు.. మన రామానాయుడు' కార్యక్రమంలో భాగంగా యలమంచిలి మండలంలో చింతదిబ్బ, నార్నిమెరక, గంగడపాలెం, లక్ష్మీపాలెం గ్రామాల్లో రూ.2.20 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. చింతదిబ్బలో ఎక్స్‌కవేటర్‌ను నడిపి మైనర్ డ్రెయిన్ తవ్వకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు మేలు జరిగే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. పంట కాలువల వెంబడి గ్రావెల్ రహదారుల నిర్మాణం, గోదావరి ఏటిగట్టు పటిష్ఠతకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అలాగే యలమంచిలి నుంచి చించినాడ వరకు గోదావరి గట్టు పటిష్ఠత పనులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. జగన్ ప్రభుత్వం గోదావరికి వరదలొస్తే పట్టించుకోలేదని, వరద ముంపు నివారణ చర్యలను గ్రామస్థులే స్వచ్ఛందంగా నిర్వహించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి, దిగమర్రు నీటిసంఘాల అధ్యక్షులు ఆరుమిల్లి రామశ్రీనివాస్, మాతా రత్నం రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపి, పాలపర్తి మాధవరావు, బెజవాడ శ్రీనివాస్, కొడవటి వరబాబు తదితరులు పాల్గొన్నారు.



పవన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీపీవో అరుణశ్రీ

'పశ్చిమ'కు రెండు పంచాయతీరాజ్ అవార్డులు

భీమవరంటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీరాజ్ విభాగం నుంచి రెండు అవార్డులను పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ స్వీకరించారు. గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదల పవన్ కల్యాణ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. పన్నుల వసూళ్లు, డోర్‌టూడోర్ కలెక్షన్, క్లీన్ విలేజ్ కేటగిరీలో ఈ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్, తదితరులు ఉన్నారు.

గణిత సామర్థ్యం పెంపుపై మూడ్రోజుల శిక్షణ

పెదపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గణిత సామర్థ్యం పెంపుపై మూడ్రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఇందులో పశ్చిమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారని, వీరికి విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడం, వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే అంశాలపై శిక్షణను అందించనున్నట్టు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ శిక్షకురాలు రేష్మ కృష్ణన్ తెలిపారు. కార్యక్రమంలో డీసీవో ఉమాకుమారి, పణిజ్యోతి, దాసరి మేరీ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.



ముసుగేసుకుని వెళ్తున్న మహిళ



ఏలూరు అమీనా పేటలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు




తరుముతున్న సూరీడు

సెగలు కక్కిన సూరీడు

ఉడికిపోయిన ఉమ్మడి జిల్లా వాసులు
రాత్రి ఏడు గంటలైనా తప్పని ఉక్కపోత
సాయంత్రం వరకు పలు చోట్ల దుకాణాల బంద్

ఏలూరుసిటీ/ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సూరీడు సెగలు కక్కాడు. గత మూడు రోజులుగా జిల్లాలో ఇదే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా భీమవరంలో గురువారం 44 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరుతో పాటు పలు ప్రాంతాల్లో 43 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవడం విశేషం. వాతావరణ శాఖ హెచ్చరించిన విధంగానే గత మూడ్రోజులుగా ఉమ్మడి పశ్చిమ ఉడికిపోయింది. గత ఏడాది కంటె ఎక్కువగా ఈ ఏడాది ఏప్రిల్‌లో వేడిగాలులు, వడగాడ్పుల తీవ్రత పెరిగిందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఏలూరుతో పాటు భీమవరం, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, నరసాపురం, కుక్కునూరు భీమడోలు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం సమయంలో రహదారులపై జన సంచారం తగ్గింది. మధ్యాహ్న వేళల్లో దుకాణాలు సైతం మూసివేస్తున్నారు. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతోంది. రాత్రి 7 గంటల వరకు వేడిగాలుల ప్రభావం కనిపించింది. ఎండల తీవ్రత విపరీతంగా పెరగడంతో ఏసీలు, కూలర్లు వినియోగం బాగా పెరిగింది. ఉపాధి పనుల కోసం వచ్చిన కూలీలు పనులు చేయలేక నానా అవస్థలు పడుతున్నారు. ఏలూరు నగరంలో ఫైర్ స్టేషన్ సెంటర్, పాతబస్టాండ్ సెంటర్, ఆర్ఆర్‌పేట, వన్‌టౌన్ సెంటర్లు మధ్యాహ్నం సమయాల్లో రహదారులపై జనసంచారం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.



ఏలూరు శాంతినగర్‌లోని ఎన్టీఆర్ సెంటర్ వద్ద పరిస్థితి



ఉడికిపోతున్నాం...






కాంక్రీటు నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణుల బృందం

పోలవరంలో నాణ్యతా బృందం పరిశీలన

పోలవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టులో అతి కీలకమైన డయాఫ్రంవాల్, గ్యాప్ 1, 2 ఎర్త్‌కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణాల కోసం వినియోగించే రాతి, కాంక్రీటు నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు వచ్చిన (సీఎస్ఎంఆర్) సెంట్రల్ సాయిల్ అండ్ రీసెర్చ్ సెంటర్ నిపుణుల బృందం గురువారం మూడో రోజు తమ పరిశీలన నాణ్యతా ప్రమాణాల పరీక్షలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు ల్యాబ్‌లో రాతి నాణ్యత, డయా ఫ్రం వాల్ ప్రాంతం, బట్రెస్ డ్యాంలలో వినియోగిస్తున్న కాంక్రీటు నాణ్యతా ప్రమాణాలను స్వయంగా పర్యవేక్షించి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ బృందం వెంట ఎస్ఈ రెడ్డి రామచంద్రరావు, క్వాలిటీ కంట్రోలు ఇంజనీర్లు మెగా ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

31 పోస్టులకు 1,228 దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులకు డిమాండ్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : డైరెక్టర్ ఆఫ్ సెకండరీ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వివిధ రకాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా అన్ని పోస్టులకు కలిపి 1,228 దరఖాస్తులు అభ్యర్థులు పెట్టుకున్నారు. ఈ నెల 9వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న వివిధ రకాల 31 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు.ఈ నెల 19వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించారు. బయోమెడికల్ ఇంజనీర్ ఒక పోస్టు(చింతలపూడి ప్రభుత్వాసుపత్రి)కు 24 మంది, ఆడియో మెట్రిక్ టెక్నీషియన్ ఐదు పోస్టులు(తణుకు, నర్సాపురం, పాలకొల్లు, భీమవరం, చింతలపూడి)లకు 8 మంది, రేడియో గ్రాఫర్ మూడు పోస్టులకు (నర్సాపురం, దెందులూరు, కొవ్వూరు) 43 మంది దరఖాస్తు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ ఒక పోస్టు (జంగారెడ్డిగూడెం) ఉండగా 92 దరఖాస్తులు వచ్చాయి. థియేటర్ అసిస్టెంట్ పోస్టులు నాలుగు (నర్సాపురం -2, గోపాలపురం, భీమవరం)కు 62 దరఖాస్తులు వచ్చాయి. ఆఫీస్ సబార్డినేట్ (జంగారెడ్డిగూడెం) 239 దరఖాస్తులు వచ్చాయి. జనరల్ డ్యూటీ అటెండర్స్ 11 పోస్టులకు (భీమవరం 2, తాడేపల్లిగూడెం 1, చింత లపూడి 2, ఆకివీడు 1, గోపాలపురం 2, భీమడోలు 1, పెనుగొండ 2) 604 దరఖాస్తులు వచ్చాయి. ఫ్లంబర్ రెండు పోస్టుల(నర్సాపురం, భీమవరం)కు 19 మంది, పోస్టుమార్టం అసిస్టెంట్ మూడు పోస్టు (పెనుగొండ, పోలవరం, బుట్టాయగూడెం)లకు 137 మంది దరఖాస్తులు చేశారు. దరఖాస్తులన్నీ కంప్యూటరీకరణ చేశారు.

వైద్య ధ్రువీకరణ పత్రాల కోసం చెకప్‌లు

నేడు హాజరుకానున్న పశ్చిమ గోదావరి జిల్లా టీచర్లు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల్లో వివిధ కేటగిరీల్లో ప్రాధాన్యతా పాయింట్లు పొందేందుకు అవసరమైన వైద్య ధ్రువీకరణపత్రాల కోసం మూడు రోజుల పాటు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో టీచర్లకు నిర్వహించే మెడికల్ చెకప్ క్యాంపు గురువారం ప్రారంభమైంది. నిర్ణీత షెడ్యూల్ మేరకు తొలిరోజున ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లాలోకి విలీనమైన 9 మండలాలు, ఏలూరు జిల్లాలోని 19మండలాలనుంచి మొత్తం 222మంది ఉపాధ్యాయులు ఆయా కేటగిరీల్లో ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్లు పొందేందుకు మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరయ్యారు. కలెక్టర్ వెట్రి సెల్వి సూచనల మేరకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికేవున్న మెడికల్ సర్టిఫికెట్లను తాజాగా ముగ్గురు వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు సంబంధిత టీచరు ఆరోగ్యస్థితి లేదా పేషెంట్ స్థితిగతులను భౌతికంగా పరిశీలించి కొత్తగా మెడికల్ సర్టిఫికెట్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్లను వెంటనే ఇవ్వలేమని, మెడికల్‌బోర్డులోని ముగ్గురు వైద్యనిపుణులు సంతకం చేయాల్సి ఉన్నందున వారంరోజుల్లో డీఈవో కార్యాలయానికి సమాచారం ఇస్తామని, నిర్ణీత తేదీన ఉపాధ్యాయులు నేరుగా సర్వజన ఆసుపత్రికి వచ్చి సర్టిఫికెట్లను తీసుకెళ్లాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ సూచించారు. శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లాలోని మండలాల టీచర్లకు మెడికల్ చెకప్ ఉంది. క్యాంపు నిర్వహణ ఏర్పాట్లను డీఈవో వెంకటలక్ష్మమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్ పర్యవేక్షించారు.

రిపోర్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఒక ఛానల్ రిపోర్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దారికాచి వెంబడించి దాడి చేశారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులోని గిలకలగేటు ప్రాంతానికి ఉల్లింగల చంద్రకాంత్ అలియాస్ చందు (36) ఒక ఛానల్ రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి మోటారు సైకిల్‌పై తన ఇంటికి వెళ్తుండగా గిలకలగేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు దారికాచి వెంబడించి ఇనుపరాడ్డుతో దాడి చేశారు. ఈ సమయంలో చేతులు అడ్డుపెట్టగా వేళ్ళు విరిగాయి. కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు వచ్చేలోపు ఆ వ్యక్తులు పారిపోయారు. దీంతో తమ కుటుంబ సభ్యుల సహకారంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరగా ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేశారు. ఏలూరు టూటౌన్ సీఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

దొంగతనం కేసులో ముగ్గురికి జైలు శిక్ష

నరసాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో గురువారం న్యాయమూర్తి కె శ్రీనివాస్ ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు టౌన్ సీఐ యాదగిరి చెప్పారు. పట్టణంలోని 10వ వార్డు జోస్యులవారివీధిలో నివాసం ఉంటున్న కొప్పర్తి వెంకటరత్నం ఇంట్లో రెండేళ్ల క్రితం చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ చోరీ పట్టణానికి చెందిన కొత్తపల్లి నరేష్, వీవర్స్ కాలనీకి చెందిన గుబ్బల భాస్కర్, అంబేద్కర్ కోనసీమా జిల్లా కొత్తపేట మండలానికి చెందిన బీర రమేష్‌లు చేసినట్లు తేలింది. వారిని పట్టుకొని విచారించగా చోరీ సొత్తు రికవరీ అయింది. నేరం రుజువు కావడంతో కేసులో ఏ1గా ఉన్న కొత్తపల్లి రమేష్‌కు రెండేళ్లు సాధారణ జైలు, రెండు వేలు జరిమానా, ఏ2 బీర రమేష్, ఏ3 గుబ్బల భాస్కర్‌లకు ఏడాది సాధారణ జైలు శిక్ష, ఒక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ అడిషనల్ సివిల్ జడ్జి కె శ్రీనివాస్ తీర్పు చెప్పారు.

ఉపాధి కూలీ మృతి



నాగమణి (ఫైల్)

నిడమర్రు ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు వచ్చిన మహిళ కాలువలో తూడు తీస్తూ మృతి చెందిన సంఘటన పెనింద్రకొలనులో చోటుచేసుకున్నది. వివరాలలోకి వెళితే నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామంలో మురుగు కాలువ బాగుచేత పనులలో భాగంగా గురువారం ఉదయం కాలువలో పని చేయడానికి కొప్పర్తి నాగమణి (48) వచ్చింది. పని చేస్తుండగా అనారోగ్యంతో ఫిట్స్ వచ్చినట్లు కొట్టుకొంటుండగా పనులు చేస్తున్న సహచర కూలీలు వెంటనే ఆమెను గట్టుకు తీసుకొని వచ్చి సపర్యలు చేశారు. కిలోమీటరు దూరంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని పోతుండగా దారిలో మృతిచెందినట్లు తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే ఎంపీడీవో జి.విజయకుమారి సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకొన్నారు.

కోనేరులో పడి పాప మృతి



కైకలూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కోనేరులోపడి 4సంవత్సరాల పాప మృతి చెందింది. గురువారం కైకలూరు మండలం కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ క్రమంలో కామవరపుకోట మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన జంపాల రాటాలు తన మనవరాలు రాజులపాటి సాహిత్య భవానీ(4) కలిసి కోనేరులో స్నానాన్ని ఆచరించారు. అనంతరం అమ్మవారి దర్శనార్థం వెళ్లగా సాహిత్య భవానీ వారిని వదిలివేసి మరలా కోనేరులో స్నానంచేసేందుకు దిగింది. ఈ క్రమంలో జారి కోనేరులో మునిగింది. భక్తుల రద్దీ తక్కువగా ఉండడంతో పాపను ఎవరూ గుర్తించలేదు. కొద్దిసేపటికి పాప కనిపించకపోవడంతో అమ్మమ్మ రాటాలు ఆలయానికి చెందిన మైకులో ప్రచారం చేయించింది. ఎంతకీ పిల్ల కనపించకపోవడంతో అనుమానించి పలువురు యువకులు కోనేరులో గాలించి పాపను బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స అనంతరం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే పాప మృతి చెందింది. పాప స్వగ్రామమం ద్వారాకతిరుమల మండలం కోడిగూడెం గ్రామానికి చెందిన రాజులపాటి రామాంజనేయులు కుమార్తె. రామాంజనేయులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు ఆడపిల్లలు నాలుగు నెలల బాబు ఉన్నారు. కోనేరులో మృతి చెందిన చిన్నారి రెండో కుమార్తె. ప్రభుత్వాసుపత్రిలో బాలిక తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు విలపిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. ఈ సంఘటనపై కైకలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ఇళ్లల్లో చోరీలు

పెదపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం వట్లూరు జాతీయరహదారి ఆనుకుని వున్న కార్నర్ స్టోన్ లేఅవుట్‌లోని రెండు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లుగా పెదపాడు పోలీసులు తెలిపారు. ఇంటి తాళాలు పగులకొట్టి ఒక ఇంటిలోని టీవీ, సౌండ్‌బార్, 14 గ్రాముల బంగారు అభరణాలు, మరో ఇంటిలో నాలుగు కాసుల బంగారు అభరణాలు ఎత్తుకెళ్లినట్లుగా బాధితులు పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురింటి వ్యక్తిపై కత్తితో దంపతుల దాడి

పాత కక్షలే కారణం.. సంఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి

యలమంచిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో బత్తుల ఏసుదాసు తన ఇంటి ఎదురుగా నివాసం ఉంటున్న కత్తుల పౌలు(59) అనే వ్యక్తిపై బుధవారం రాత్రి కత్తితో దాడిచేసి మెడపై నరకడంతో పౌలు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతేరు గ్రామం కట్టావారిపుంత ప్రాంతంలో ఎదురెదురు ఇళ్లలో నివాసం ఉంటున్న బత్తుల ఏసుదాసు, కత్తుల పౌలు కుటుంబాల మధ్య కొంతకాలంగా పాతకక్షలు, గొడవలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి బత్తుల ఏసుదాసు కత్తితో వెళ్లి పౌలు ఇంటితలుపులు బాదాడు. పౌలు భార్య జానకమ్మ ఇంటితలుపు తెరవడంతో, ఆమెను తోసుకుంటూ ఏసుదాసు, అతని భార్య భారతి ఇంట్లోకి వెళ్లారు. ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న పౌలు పై ఏసుదాసు కత్తితో విచక్షణారహితంగా దాడిచేస్తుండగా ఏసుదాసు భార్య భారతి పౌలు కాళ్లుపట్టుకుని భర్తకు సహకరించింది. పౌలు అక్కడికక్కడే మృతి చెందాడు. నరసాపురం డీఎస్పీ శ్రీవేద, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గుర్రయ్యలు గురువారం ఘటనాస్థలాన్ని, మృతదేహాన్ని పరిశీలించి కుటుంబసభ్యులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుని భార్య జానకమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితులు ఏసుదాసు, భారతిలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



పౌలు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీవేద, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గుర్రయ్య

హత్యాయత్నం కేసులో యువకుడి అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ అత్తపై కక్ష పెంచుకుని ఆపై హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ గురువారం అరెస్టు చేశారు. ఏలూరు కత్తేపువీధికి చెందిన షేక్ బాజీ గతంలో బావిశెట్టివారిపేటకు చెందిన ఒక యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ తరువాత ఆమెను వదిలి వేశాడు. ఆ యువ తి తల్లి అయిన జయలక్ష్మిపై కక్ష పెంచుకున్నాడు. ఈనెల 22వ తేదీ రాత్రి ఆమె బిర్లాభవన్ సెంటర్ వద్ద ఉండగా అకస్మాత్తుగా వెనుక నుంచి వచ్చి ఆమెపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమెను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసులు షేక్ బాజీపై హత్యాయత్నం కేసు నమోదుచేశారు. అతనిని గురువారం సాయంత్రం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో జిల్లా జైలుకు తరలించారు.

జలపాతంలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు



ప్రమాదానికి కొద్ది సమయం ముందు జలపాతం వద్ద కిశోర్

పెదబయలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు వేడుక జరుపుకునేందుకు స్నేహితులతో కలిసి గురువారం తారాబు జలపాతానికి వచ్చిన ఓ బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. స్నేహితులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. దీనికి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు ఎస్ఐ కొల్లి రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన గొన్నూరు కిశోర్ (22) విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని వెల్ఫేర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 25న అతని పుట్టినరోజు కావడంతో తోటి విద్యార్థులు లోకవరపు చంద్రశేఖర్, పాడి శామ్యూల్, కమ్మ నేని సంతోశ్‌లతో కలిసి బుధవారం రాత్రి అరకులోయ వచ్చాడు. అక్కడ ఓ లాడ్జిలో బస చేశారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అంతా కలిసి తారాబు జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ ఫొటోలు దిగారు. జలపాతం సందర్శన అనంతరం మళ్లీ రాత్రి అరకులోయ వెళ్లి కేక్ కట్ చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే జలపాతంలో స్నానం చేయడానికి దిగిన కిశోర్ గల్లంతయ్యాడు. అతని కోసం స్నేహితులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమణ తెలిపారు.



లారీని ఢీకొట్టిన మోటార్ సైకిల్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఏపీనిట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గురువారం రాత్రి ఆగిఉన్న లారీని మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కరణం వెంకటేశ్(30) మృతి చెందగా, అంబటి నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సింగిల్ రోడ్డులో ఆపిన లారీని చికట్లో కనిపించక ద్విచక్రవాహన చోదకులు ఢీకొట్టటారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ అపస్మారకస్థితిలో ఉండటంతో వారిని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరు తాడే పల్లిగూడెం పట్టణ వాసులుగా భావిస్తున్నారు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సింగిల్ రోడ్డులో ఎలాంటి సిగ్నల్ లేకుండా భారీ వాహనాలు ఆపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రైలులో ఒక ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. హైదరాబాద్‌కు చెందిన ఏడిద శివనాగకుమార్ (34) హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్ళే రైలులో ప్రయాణిస్తున్నాడు. గురువారం సాయంత్రం విజయవాడ దాటిన తరువాత రైలులో అస్వస్థతకు గురికాగా తోటి ప్రయాణికులు వెంటనే రైల్వే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఏలూరు జీఆర్‌పీ పోలీసులకు, స్టేషన్ మాస్టార్‌కు సమాచారం కంట్రోల్ రూమ్ నుంచి రావడంతో ఆ రైలును ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఆపారు. రైల్వే వైద్యులను, సిబ్బందిని కూడా సిద్ధం చేశారు. ఆయనను రైలు నుంచి బయటకు దింపి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని రైల్వే వైద్యులు నిర్ధారించారు. దీంతో రైల్వే ఎస్ఐ పి సైమన్ ఈసంఘటనపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఏలూరులో మార్చురీకి తరలించారు.

మే 3 నుంచి వైశాఖ బ్రహ్మోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మే 3 నుంచి 12వ తేదీ వరకు వైశాఖ బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. హోమాలు నిర్వహించేందుకు యాగశాల నిర్మాణం జరుగుతోంది. 9న ఆలయ విమాన సుదర్శన శిఖర ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవం, 10న స్వామివారి వైశాఖ కళ్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్, ప్రధాన అర్చకులు మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు తెలియజేశారు.

దొండపాడులో వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : దొండపాడులోని శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా ఉదయం నిత్యపూజ అనంతరం స్వామికి పంచామృత ఆరాధన అభిషేకం తదుపరి తోమాల సేవ సహస్రనామార్చన విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసి అర్హత సాధించిన నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు గురువారం తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అర్హులకు 8 నెలలు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ప్రభుత్వం ద్వారా జర్మనీ భాషపై ఉచిత శిక్షణలో భాగంగా భోజన, వసతి సదుపాయం ఇచ్చి బి2 లెవల్ పరీక్ష ద్వారా జర్మనీలోని వివిధ హాస్పిటల్స్‌లో ఉద్యోగావకాశం కల్పించనున్నట్టు విజయరాజు తెలిపారు.మరింత సమాచారానికి(90307 44877) నెంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దంత సంరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం


మొక్క నాటుతున్న విద్యార్థులు

పెదవేగి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : దంత సంరక్షణతో సగం వ్యాధులు దూరమవుతాయని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజేశ్ అన్నారు. అంతర్జాతీయ మాక్సిలో ఫెషియల్ రేడియాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో దంత సంరక్షణ, నోటిద్వారా ప్రబలే వ్యాధు లపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఫాదర్ మోజేశ్ మాట్లాడుతూ దంత సంరక్షణపైనే వ్యక్తి ఆరోగ్యం ఆధారపడి ఉందన్నారు. అలాగే మొక్కలు పెంచి వాతావరణ సమతుల్యతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మృదుల, డాక్టర్ స్వాతి, దంతవైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నాగమణి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనిచేస్తూ పని ప్రదేశంలో చనిపోయిన పొరపాటు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఉపాధి హామీ డ్వామా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రఘురామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామంలో కూరపాటి నాగమణి(48) అనే మహిళ పనిచేస్తూ బోదీ కాల్వలో పడి చనిపోయిందన్నారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చనిపోతున్న కూలీల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్ రాజశేఖర్, ఎం సత్యం పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి వార్షికోత్సవాలు

పెదవేగి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : అమ్మపాలెంలోని చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ 6వ వార్షికోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. ఈ వేడుకల్లో పాల్గొన్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన భోజనశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కె.వరప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడికి జడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



ఏలూరుసిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆయుష్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు గురువారం పరామర్శించారు. ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్, చిగురుపల్లి శామ్యూల్ తదితరులు ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు త్వరగా కోలుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌లు ఆకాంక్షించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ

పెదవేగి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : రాయన్నపాలెంలో రైతుల వ్యవసాయ మోటార్ల దగ్గర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. రాయన్నపాలెం గ్రామానికి చెందిన వీరంకి నాగేశ్వరరావు, అవిర్నేని సరోజిని అనే ఇరువురు రైతుల పొలాల్లోని వ్యవసాయ మోటార్ల దగ్గర ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరును గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని రాగివైరును ఎత్తుకుపోయారని ఏఈ కె.నరేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

పెదవేగి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : వట్లూరుకు చెందిన ఉప్పులూరి నాగరాజు అనే వ్యక్తి ఈ నెల 16న పెదవేగి మండలం రామచంద్రాపురం బంధువుల ఇంటికి వచ్చి, అక్కడి నుంచి చింతలపూడివైపు వెళ్తుండగా వెనుకనుంచి లారీ ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. అతనికి తొలుత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు విజయవాడకు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ బీవీ కృష్ణారావు

టెన్త్ ఫలితాల్లో శ్రీరామచంద్ర విద్యా సంస్థల జయభేరి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : టెన్త్ ఫలితాల్లో శ్రీరామచంద్ర విద్యా సంస్థల విద్యార్థులు జయభేరి మోగించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ బి.వి.కృష్ణారావు తెలిపారు. తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.ఎం.మౌనిక ప్రసన్న 595 మార్కులు సాధించి తమ విద్యా సంస్థను ప్రతిభను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిందన్నారు. ఎన్.పి.ఎస్.దుర్గ 587, కె.జశ్వంత్ 571, కేడీఎస్ఎస్.హర్షిత 558, డీహెచ్ఎస్.నందిని 547,జి.ఐశ్వర్య 545, జి.లావణ్య 541, మరో తొమ్మిది మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీవీఎస్.జగదీష్ కుమార్, సీఏవో ఉమా, అకడమిక్ ఇన్‌చార్జిలు హెచ్‌బీఆర్. ప్రసాద్, ఎం.రాధిక, పి.అశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో విద్యావికాస్ యాజమాన్యం

టెన్త్ ఫలితాల్లో విద్యావికాస్ విజయకేతనం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షా ఫలితాల్లో విద్యావికాస్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. కె.రుష్మిత 596 మార్కులు సాధించి తన ప్రతిభను కనబర్చగా ఎం.జాయ్‌నిస్సీ 592, ఎం.శ్రీదేవి 592, ఎం.సంజన 592, జి.వర్షిత 591, ఎస్.అక్షర 591, పి.దీపిక 591, దివ్య 589, తేజస్విని 587, కె.సాయి లక్ష్మి 586, ఎస్.కె.సాధియా 586, వై.సువర్ణ 586, ఎం.అభిరామ్ 585, బి.అక్షయ 585, చందు 584, జగదీష్ 584,కౌశిక 584, పవన్ సాయి 583, జ్ఞాంధవి 583, శ్యామ్ కుమార్ 582,అర్చన 582, సత్యకృష్ణ 581, మంగతాయారు 581, పి.జయశ్రీ 581 మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.సతీశ్ చంద్ తెలిపారు. అలాగే 150 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను పి.సతీశ్ చంద్, వి.శ్రీనివాస్, వి.ప్రసన్నలక్ష్మి, పి.లక్ష్మీ ప్రసన్న పుష్ప గుచ్ఛాలిచ్చి అభినందించారు.

అంధకారం..

» కొవ్వాడ అవుట్ ఫాల్ స్లూయిజ్‌పై వెలగని విద్యుత్ దీపాలు
» రాత్రి వేళ రోడ్డు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


కొవ్వాడ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌పై ఉన్న విద్యుత్ దీపాలు

పోలవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) :పోలవరం మండలం పట్టిసీమ వద్ద కొవ్వాడ అవుట్ ఫాల్ స్లూయిజ్‌పై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. వెలగకపోవడంతో ఆ మార్గంలో రాత్రి సమయాలలో ప్రయాణించే వాహనదారులు మార్గం కానరాక తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. దీనికి తోడు అవుట్ ఫాల్ స్లూయిజ్ వంతెనకు కొవ్వూరు వైపు, పోలవరం వైపు మలుపులు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనాలు అదుపుతప్పి వెంకటేశ్వరస్వామి ఆలయం వైపు ర్యాంపులో పడిపోతున్నాయి. ఈ ప్రమాదాల్లో గాయాల పాలవ్వడంతో పాటు వాహనాలు ధ్వంసమవుతున్నాయి. గత 6 నెలలుగా ఈ విద్యుత్ దీపాలు వెలగడం లేదని, పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో సైతం లైట్లు వెలగక పోవడంతో భక్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి స్లూయిజ్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధుల కొరతతో ఇబ్బందులు..

రాహుల్ భాస్కర్, ఏఈ, కొవ్వాడ రిజర్వాయర్

మెయింటినెన్స్ గ్రాంట్లు లేకపోవడంతో ఈ విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయించలేకపోతున్నాం. ఈ కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే.. ఉన్న తాధికారులకు నివేదికపంపి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. గ్రామస్థులు ఒకటో నెంబరు గేటు వద్ద చెత్త వేస్తున్నారు. దీంతో ఎలుకలు చేరి విద్యుత్ వైర్లను కొరికివేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి నోటీసులిచ్చి కఠిన చర్యలు తీసుకోవాలని కోరాం.

ఉచిత అడ్మిషన్లపై డీఈవోకు 'అపుస్మా' వినతి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : వెనుకబడినవర్గాల కుటుంబాల్లోని పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25శాతం ఉచిత ప్రవేశాల కోసం ప్రభుత్వం జారీచేసిన జీవో అమలుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒత్తిడిచేయడం తగదని ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా) జిల్లా శాఖ నాయకులు ఆక్షేపించారు. ఉచిత విద్యలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నిధులు కేటాయించి వాటిని ప్రైవేటు పాఠశాలలకు జమచేయడంతో పాటు, పాత బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వచ్చే వరకు ఈ ఏడాది అడ్మిషన్లను రిజిస్ట్రేషన్ చేయబోమని సంఘ నాయకులు తేల్చి చెప్పారు. ఈ మేరకు గురువారం డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్ కుమార్‌లను 'అపుస్మా' జిల్లా ప్రతినిధులు కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్‌శర్మ, ఎన్ఆర్‌కేవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లకు ఉచిత విద్య ప్రవేశాలకు తాము వ్యతిరేకులం కాదన్నారు.ఉచిత విద్య వల్ల జిల్లాలో ఏటా సుమారు 900 మంది వరకు అడ్మిషన్లు ఇచ్చామని, వీటికి ఇవ్వాల్సిన రూ.2 కోట్లు బకాయిల్లో ప్రభుత్వం ఇంతవరకు విడుదల చేయలేదన్నారు. కేవలం ఉచితవిద్యకోసమే తల్లి దండ్రులు అవాస్తవాలతోకూడిన ధ్రువపత్రాలను సమర్పిస్తున్నారని ఆరోపించారు. జీవో ప్రకారం కేవలం ఒక కిలోమీటరు దూరంలోపు వారికి మాత్రమే సమీప పాఠశాలలను కేటాయించాల్సిఉండగా 3కిలోమీటర్లపైబడిన వారికి కూడా ప్రవేశాలు కల్పిస్తున్నారని వివరించారు. ఉచిత విద్య కింద అడ్మిషన్ పొందిన ప్రతీ విద్యార్థికి రూ.15వేలు చొప్పున స్కూలుకే నిధులు జమచేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకుల డిమాండ్లను ప్రభుత్వానికి నివేదిస్తానని డీఈవో హామీ ఇచ్చారు. వినతిపత్రాన్ని సమర్పించిన 'అపుస్మా' నాయకుల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బి.ఎస్.శర్మ, వెంకటేశ్వరరావు, సతీష్, శేఖర్, మనోహర్, తదితరులు ఉన్నారు.



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ


కొయ్యలగూడెంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉగ్రదాడిని ఖండిస్తూ శాంతి ర్యాలీలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : కశ్మీర్లో భయానక వాతావరణం సృష్టించేందుకే ఉగ్రదాడులు దాడికి పాల్పడ్డారని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఏలూరులో గురువారం సాయంత్రం జనసేన కన్నీటి నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జనసేన కార్యాలయం వద్ద నుంచి 12 పంపుల సెంటర్, చేపలతూము సెంటర్ మీదుగా బోసు శిబిరం వరకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ అనంతరం కూడలిలో ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో ఓబిలిశెట్టి శ్రావణ్‌గుప్తా, నగర అధ్యక్షులు నాగిరెడ్డి కాశీ నరేశ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● నిడమర్రు : ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజు పిలుపు మేరకు నిడమర్రు సెంటర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు నిమ్మల దొరబాబు, కన్నాజి చిన్ని, చెల్లంశెట్టి సూరిబాబు, చెల్లంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

● చింతలపూడి : జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ పట్టణ జామియా మసీదు కమిటీ, జమాతే ఇస్లామి హింద్ సంయుక్తంగా ప్రకటన విడుదల చేసింది. మసీదు కమిటీ అధ్యక్షులు సయ్యద్ రహీం మాట్లాడుతూ ఈ దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్టు తెలిపారు. సమావేశంలో మసీదు కమిటీ కార్యదర్శి ఎం.డి. జిలాని, సభ్యులు ఎం.డి. ఇస్మాయిల్, సయ్యద్ రజాక్, ఎస్.కె.సుబాని, ఇమ్రాన్, ఆజాద్, పాషి, రహీంతుల్లా పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో కూటమి నాయకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను సమర్థవంతంగా తిప్పికొట్టాలని, పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా పరిగణించాలంటూ నినాదాలు చేశారు. ప్రధాన సెంటర్ నుంచి బస్టాండ్ వరకు అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, బీజేపీ మండలాధ్యక్షుడు గొలిశెట్టి శ్రీనివాస్, జనసేన పార్టీ నాయకులు చోడిపిండి సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్ఆర్. నరసింహరాజు, ఎన్.బాబీ, మేడిన కన్నయ్య, చిలువూరి శ్రీను, చవ్వా రాము పాల్గొన్నారు.

●బుట్టాయగూడెం : ఉగ్రదాడుల్లో చనిపోయినవారి కుటుంబాలకు కేంద్రం న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు తెల్లం రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, పోలోజు నాగేశ్వరావు, వెట్టి వీరయ్య, చంద్రు బుల్లెమ్మ, మడకం శ్రీదేవి, భీమరాజు పాల్గొన్నారు.

● దెందులూరు : దెందులూరు నియోజకవర్గ జనసేన పార్టీ ముఖ్యనాయకులు కొఠారు ఆదిశేషు, మహిళా నాయకురాలు లక్ష్మీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. దెందులూరు 9వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

● లింగపాలెం : ఉగ్రదాడిని ఖండిస్తూ ధర్మాజీగూడెంలో శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో పాతూరి శ్రీనివాసరావు, గారపాటి బుజ్జయ్య, మొరంపూడి ప్రసాద్, జి.సాయి, రాయంకుల చక్రధరరావు, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, పి.మహేశ్‌బాబు, చల్లా నాగబాబు, మాదాసు కృష్ణ పాల్గొన్నారు.

● భీమడోలు : ఉగ్రదాడిని ప్రతి వ్యక్తి ఖండించాలని తెలుగుదేశం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడికిబలైన వారికి సంతాపం వ్యక్తం చేసి గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్స్ అందజేత


వీల్ చైర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నిడమర్రు ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు అండగా బాసటగా నిలిచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. గురువారం నిడమర్రు భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా దివ్యాంగుగులకు 5 వీల్ చైర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిడమర్రు ఉన్నత పాఠశాలలో ఇటీవల విడుదలైన పది ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే ధర్మరాజు అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో ఎంఈఒలు విజయభాస్కర్, శ్రీనివాసరావు, హెచ్‌ఎం రాజేశ్వరి, ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు క్షత్రీయ కార్పరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో పంచాయతీరాజ్ దినోత్సవం


లక్కవరంలో కళాకారుడు సబ్బి కనకారావు, టెన్త్ విద్యార్థిని తేజస్వినిని సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం ఏలూరు రోడ్డు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. చాటపర్రు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస వర్మ పంచాయతీరాజ్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ ఎక్కడా లేని విధంగా గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ పనిచేస్తోందన్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో ప్రజలు వార్డులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

● లింగపాలెం : పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల విస్తరణాధికారి జేయం రత్న కుమార్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థ పనిచేస్తోందని అన్నారు.కార్యక్రమంలో మండలంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : లక్కవరం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సర్పంచ్ గెల్లా వెంకట రమణ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా కళారత్న అవార్డు పొందిన ప్రముఖ బుర్రకథా కళాకారుడు సబ్బి కనకారావును, టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన పులి తేజస్వినిని సర్పంచ్ వెంకట రమణ, కార్యదర్శి పగడం నాగేశ్వరరావు టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లక్కవరం పంచాయతీ ప్రత్యేకాధికారి ఎం.భీమేశ్వరరావు, టీడీపీ గ్రామాధ్యక్షుడు గద్దే వెంకటేశ్వరరావు(బాబీ), జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దోరేపల్లి మాధవరావు పాల్గొన్నారు.

● ఏలూరుసిటీ : మంగళగిరిలోని సికె కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నూర్‌బాషా సంఘ సభ్యులు

నూర్‌బాషా సమస్యలపై అధికారులకు వినతి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సచివాలయంలో నూర్‌బాషాల సమస్యలపై అధికారులతో జరిగిన చర్చలు సఫలమవుతాయన్న సంతృప్తి ఉందని గోపాలపురం నియోజవర్గ నూర్‌బాషా సంఘ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ అన్నారు. నూర్ బాషాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వంద కోట్లు కేటాయించడం, మైనార్టీలకు వర్తించే అన్ని పథకాలు నూర్‌బాషాలకు వర్తింపజేయడం వంటి విషయాలపై అధికారులతో చర్చించారు. టీడీపీ అధికార ప్రతినిధి, నాగుల్ మీరా, నేతలు షేక్ సుభాన్, బాబన్, షేక్ మీరా, ఆరీఫ్, షేక్ ఇబ్రహీం, సర్దార్ తదితరులు అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ ప్రభుత్వ కార్యదర్శి సి.హెచ్.శ్రీధర్, బీసీ సంక్షేమ ప్రభుత్వ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ తదితరులను కలిసి సమస్యలు వివరించినట్టు ఇస్మాయిల్ తెలిపారు.

అదనపు తరగతి గదులకు భూమి పూజ

టి.నర్సాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టినట్లు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ తెలిపారు. తిరుమలదేవిపేట యూపీ స్కూల్‌లో అదనపు తరగతిగదుల నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలదేవిపేట గ్రామంలోని యూపీస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో విద్యార్థులకు సరిపడ గదులులేని కారణంగా తరగతి గదుల నిర్మాణానికి గ్రామస్థులు, కూటమి నాయకులతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తోట సత్యనారాయణ, పండు, వీరాస్వామి నాయుడు, పీవీవీఎస్ రామలింగేశ్వరరావు, పుల్లారావు పాల్గొన్నారు.

వీరభద్రవరంలోచలివేంద్రం ప్రారంభం

టి.నర్సాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం వీరభద్రవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జలపాలు, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, శీలం సాయివినయ్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ర్యాంకర్ జరీనాకు అభినందన

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 369 ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన బాలిక పఠాన్ జరీనాను ముస్లిం జేఏసీ సభ్యులు గురువారం అభినందించారు. వక్ఫ్‌బోర్డు మాజీ జిల్లా చైర్మన్ ముస్తఫా మాట్లాడుతూ విద్యలో ప్రతి ఒక్కరూ రాణించాలని సూచించారు. బిలాల్ మసీదు అధ్యక్షుడు షేక్ యాకూబ్ మాట్లాడుతూ జరీనా ఉన్నత విద్యకు సహకరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టిప్‌టాప్ బాజీ, షేక్ షాహిన్, ఉపాధ్యాయుడు ఎం.ఎ.నబీ, షేక్ ఆదిల్, షఫీ, సూర సాహెబ్, రషీద్, సమీ పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేత

ఉంగుటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : కాగుపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కడియాల శేషగిరిరావు జ్ఞాపకార్థం వారి మనుమడు గారపాటి మనోహర్ సౌజన్యంతో వారి తల్లి రమాదేవి చేతుల మీదుగా రూ.60 వేల విలువైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను వైద్యాధికారిణి మానస,సాయి అనూషలకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కడియాల రవిశంకర్, శుభశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ కార్మికులకు ఉచిత పరీక్షలు

ఉంగుటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మొబైల్ ఐసీటీసీ వాహనం ద్వారా ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలను గురువారం నుంచి చేపట్టనున్నారు. నియోజకవర్గంలోని ఐస్, శ్రీంప్, ఫీడ్ యూనిట్లలో పనిచేసే కార్మికులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల కార్మికులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ వర్కర్ల సంక్షేమం కొరకు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తులసి సూరన్న మరియు సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలుకు సీఐటీయూ ధర్నా

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : తెలు గుదేశం కూటమి ఎన్నికల్లో ఇచ్చిన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్నిర్మిస్తామనే హామీలు అమలు చేయాలని కోరుతూ కార్మికశాఖ కార్యాలయం వద్ద బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు కార్మిక శాఖ కార్యాలయంలో ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్య క్షులు ఎస్.రమణారావు, జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, డి.ఎస్.వి.డి.ప్రసాద్, నాయకులు అయినపర్తి మాధవ, సి.హెచ్. కొండలరావు, షేక్ అబ్దుల్, అక్బర్, చీర అప్పారావు, పర్సా రాజేశ్, తానా సాంబశివరావు, బత్తుల బుజ్జి, తాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు 10 కుర్చీల అందజేత

ఏలూరు రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో ఏలూరులోని చాణిక్యపురి కాలనీలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు 10 కుర్చీలను అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ జి.సత్యనారాయణ అందించారు. గురువారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల రిటైర్డ్ తెలుగు శాఖాధ్యక్షురాలు కీర్తిశేషులు షేక్ రహిమాన్ జ్ఞాపకార్థం వారి భర్త, యూనిట్ అధ్యక్షులు షేక్ హుస్సేన్ ఆర్థిక సహకారంతో అందించారు.

ఇంటర్వ్యూ..

33 చెరువుల ద్వారా 9,124 ఎకరాలకు సాగు నీరు

కె.లాజర్ బాబు, జలవనరుల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్, గోపన్నపాలెం సెక్షన్



● **గోపన్నపాలెం సెక్షన్ పరిధిలో ఎన్ని మండలాలున్నాయి?**

జవాబు : గోపన్నపాలెం సెక్షన్ పరిధిలో దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాలున్నాయి. వాటిలో వంద ఎకరాలు విస్తీర్ణంలో చెరువులు 33 ఉన్నాయి. ఈ చెరువుల కింద ఆయకట్టు 9 వేల 124 ఎకరాల విస్తీర్ణం ఉంది.

● **సాగునీటి వినియోగదారుల కమిటీలు పూర్తయ్యాయా?**

జవాబు : పెద్ద చెరువుల కింద పరిధిలో వ్యవసాయం ఉన్న ఆరుగురు రైతుల సభ్యులతో 33 కమిటీ సాగు నీటి వినియోగదారుల కమిటీలు వేశాం. నీటిని సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటారు.

● **చెరువుల మరమ్మతులకు చేపట్టిన చర్యలేమిటి?**

జవాబు : గోపన్నపాలెం సెక్షన్‌లో చెరువుల మరమ్మత్తులు, తూములు, కాల్వలు, కల్వర్టులు, గేట్లు మరమ్మతులకు నిధులు అవసరముంది. నీటి వినియోగదారుల ద్వారా ప్రభుత్వానికి నిధుల మంజూరు కోసం నివేదిక ఇచ్చాం. ప్రస్తుత పనులకు, ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్‌కు రూ.11 కోట్లు అవసరమని ప్రతిపాదనలను పంపాం. ఈ చెరువుల పరిధిలో చివరి రైతు వరకు సాగునీరు అందిస్తున్నాం.

- దెందులూరు

నిత్యావసరాల పంపిణీ

ఏలూరురూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జేవియర్ నగర్‌లోని విహాన్ చారిటబుల్ ట్రస్ట్‌కు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల, లైన్స్ క్లబ్ సంయుక్తంగా గురువారం బియ్యం, నూనె, కందిపప్పు, పలు రకాల దినుసులను పండ్లు అందజేశారు. కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి.మోజేశ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. విహాన్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కె.శ్యాంబాబు, దంత కళాశాల లైన్స్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్.నల్లయ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఉంగుటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఇంటర్న్‌షిప్ విభాగం, ఓ.టీ.పి. టెక్నాలజీస్ సంయుక్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత చెందిన 30 మంది విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ కోర్సు, ఆఫీస్ మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్‌లో 40 రోజుల కోర్సును ప్రారంభిస్తున్నట్టు ప్రి న్సిపాల్ టి.కె.విశ్వేశ్వరరావు తెలిపారు. 26వ తేదీ లోపు (81251 55788) సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరురూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చాటపర్రు సెక్షన్ పరిధిలో వార్షిక మరమ్మతులను పురస్కరించుకుని శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఆపరేషన్ కె.ఎం.అంబేడ్కర్ గురువారం తెలిపారు. చాటపర్రు, గుడివాక లంక, కోటేశ్వరదుర్గాపురం, తిమ్మారావుగూడెం, ఆటోనగర్, కొమడవోలు, తూర్పులాకులు, సాయినగర్, హమాలీ కాలనీ ఏరియాల్లో ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

పెదవేగి మండలంలో...

పెదవేగి : విజయరాయి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అంబేడ్కర్ తెలిపారు. అలాగే కవ్వగుంట విద్యుత్ ఉప కేంద్రంలో హెడ్ క్వార్టర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఆయా విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కైకరంలో చలివేంద్రం ప్రారంభం

ఉంగుటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : కైకరం కాల్వగట్టున కొలువైన సుందర సీతారామ మందిరం వద్ద ప్రముఖ న్యాయ విజ్ఞాన మోటివేటర్ కూనా కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కమిటీ సభ్యులు, రైతులు పాల్గొని తొలిరోజు మజ్జిగను అందించినట్టు కమిటీ నిర్వాహకులు కూనా అప్పారావు వివరించారు.

బస్సును ఢీకొన్న మోటార్ సైకిల్: ఇద్దరికి తీవ్ర గాయాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి: ముదినేపల్లి సమీపంలో జాతీయరహదారిపై గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గుడివాడ నుంచి బైక్‌పై వస్తున్న ముదినేపల్లికి చెందిన కంచర్ల రాజశేఖర్ , వెనుకొండ సునీల్ కుమార్ బైక్ అదుపు తప్పిన పరిస్థితిలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ఈ సంఘటనలో ఇరువురి తలకు గాయాల య్యాయి. గుడివాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నేడు టీడీపీ గ్రీవెన్స్

కైకలూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. ఉదయం 10గంటలకు కైకలూరు సీతారామమినీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గస్థాయి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కార్యకర్తలు, సమస్యలు, ఫిర్యాదుల స్వీకరణ, పార్టీ సంస్థాగత నిర్మాణం బలోపేతం వివిధ కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబరిచినవారిని అభినందిస్తామన్నారు.






ముదినేపల్లి ఐటీఐ కళాశాలలో మౌనం పాటించి మృతులకు నివాళులు.. నూజివీడు, చాట్రాయిలలో కొవ్వొత్తుల ప్రదర్శన..

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన

- కాశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల కాల్పులు..
- ఈ సంఘటనను ఖండిస్తూ పలు రాజకీయ పక్షాలు, సంస్థల ప్రదర్శన
- కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి):జమ్మూకాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన వారికి రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి ఘన నివాళులర్పించారు. నూజివీడు మండలం యనమదల గ్రామంలో అమరులకు నివాళులర్పిస్తూ బారీ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఉగ్రదాడిని ఖండిస్తూ హేయమైన చర్యను ప్రతిఒక్కరూ ఖండించాలని ఆకాంక్షిస్తూ అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ముసునూరి రాజా, ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు: కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దుశ్చర్యలను ఖండిస్తూ వివిధ రాజకీయపక్షాలు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసువులు బాసిన పర్యాటకులకు ఘననివాళులు అర్పించారు. నూజివీడు అమర్‌భవన్ నుంచి చిన్నగాంధీబొమ్మ సెంటర్‌వరకు సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకటరామారావు, సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, ఏఐటీయూసీ నాయకులు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం అనుబంధ ప్రజాసంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ప్రధాన కార్యదర్శి జి.రాజు ప్రసంగించారు. నూజివీడు బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టుకాంప్లెక్స్ వద్ద న్యాయవాదులు అసువులు బాసిన పర్యాటకులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షులు మన్నెం రమేష్, న్యాయవాదులు, పాల్గొన్నారు.

చాట్రాయి: కాశ్మీర్‌లో టూరిస్టుల పై ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని దారుణంగా హత్య చేయడాన్ని ఖండిస్తూ చాట్రాయిలో బుధవారం రాత్రి వివిధ పార్టీల నాయకులు, పౌరులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఇంత దారుణానికి ఒడిగట్టడం అమానుషమని, దీనికి బాధ్యులైన వారిని భారత ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు మందపాటి బసవారెడ్డి, రాయవరపు పుల్లారావు, కమ్ముల కొండలరావు, కంచర్ల హనుమంతరావు, ఆదిమూలం శర్మ, జగన్, శ్రీకాంత్, శీర్లం వేణు, ముత్తారెడ్డి పాల్గొన్నారు.

ముదినేపల్లి: కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన టూరిస్టుల ఆత్మకు శాంతి కలగాలని గురువారం ముదినేపల్లిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి శాంతి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మీ, పార్టీ నాయకులు వత్తుమిల్లి ప్రసాద్, మాడుగుల పూర్ణచంద్రరావు, రెడ్డి నాగలక్ష్మి, కొల్లిపర నాగరాజు తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, పలువురు మహిళలు కొవ్వొత్తులతో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదుల దాడుల పట్ల నిరసన వ్యక్తం చేశారు. ముదినేపల్లిలోని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ హరిత, ఇన్‌స్ట్రక్టర్లు భీమరాజు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. మృతులకు శాంతి కలగాలని కళాశాలలో జరిగిన సమావేశంలో మౌనం పాటించారు.

ఉగ్రవాదుల దాడులు హేయం: ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో అమాయకులపై ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్యని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన తీవ్రవాదుల దాడిని తీవ్రస్థాయిలో ఖండించి మృతులకు సంతాపం తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఉగ్రవాదులు టూరిస్టులపై కాల్పులకు తెగబడడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్వ్యూ..

వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

జి.రాణి, ఎంపీడీవో



- **వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు ఏమిటి?**

జవాబు: తాగునీటి ఎద్దడి ఉన్న నాలుగు గ్రామాలను గుర్తించాం. మంజూరైన నిధులతో నూతన బోర్లు వేసి, నీరు సరఫరాకు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 16 పంచాయతీల్లో నీటి సరఫరా బాగానే ఉంది.

- **స్వచ్ఛాంధ్ర సాధనకు చర్యలు ఏమిటి?**

జవాబు: ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతున్నాం. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోంది. సంపద కేంద్రాలకు చెత్తను తరలించి, వర్మికంపోస్ట్ తాయారు చేసేలా ప్రక్రియ జరుగుతోంది.

- **ప్రభుత్వ పథకాల అమలు ఎలా జరుగుతున్నది?**

జవాబు: ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో మండలాన్ని మందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నాం.

- ముసునూరు, ఆంధ్రజ్యోతి

కోనేరులో పడి పాప మృతి



కైకలూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కోనేరులోపడి 4సంవత్సరాల పాప మృతి చెందింది. గురువారం కైకలూరు మండలం కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ క్రమంలో కామవరపుకోట మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన జంపాల రాటాలు తన మనవరాలు రాజులపాటి సాహిత్య భవానీ(4) కలిసి కోనేరులో స్నానాన్ని ఆచరించారు. అనంతరం అమ్మవారి దర్శనార్థం వెళ్లగా సాహిత్య భవానీ వారిని వదిలివేసి మరలా కోనేరులో స్నానంచేసేందుకు దిగింది. ఈ క్రమంలో జారి కోనేరులో మునిగింది. భక్తుల రద్దీ తక్కువగా ఉండడంతో పాపను ఎవరూ గుర్తించలేదు. కొద్దిసేపటికి పాప కనిపించకపోవడంతో అమ్మమ్మ రాటాలు ఆలయానికి చెందిన మైకులో ప్రచారం చేయించింది. ఎంతకీ పిల్ల కనపించకపోవడంతో అనుమానిసించి పలువురు యువకులు కోనేరులో గాలించి పాపను బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స అనంతరం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే పాప మృతి చెందింది. పాప స్వగ్రామమం ద్వారకాతిరుమల మండలం కోడిగూడెం గ్రామానికి చెందిన రాజులపాటి రామాంజనేయులు కుమార్తె. రామాంజనేయులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు ఆడపిల్లలు నాలుగు నెలల బాబు ఉన్నారు. కోనేరులో మృతి చెందిన చిన్నారి రెండో కుమార్తె. ప్రభుత్వాసుపత్రిలో బాలిక తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు విలపిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. ఈ సంఘటనపై కైకలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



మండవల్లి సచివాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

గ్రామాల్లో పంచాయతీరాజ్ దినోత్సవం

మండవల్లి ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందినపుడే దేశం సుభిక్షంగా ఉంటుందని, గ్రామ స్వరాజ్యం దేశానికి గర్వకారణమని సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండవల్లి సచివాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు.

కలిదిండి: పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కలిదిండి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొండలరావు సిబ్బంది గురువారం గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు.

ముదినేపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామ సచివాలయంలో గురువారం జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవంలో ఆయన మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవం జరిగింది.

ముసునూరు: పంచాయతీ రాజ్ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నపుడే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో జి.రాణి అన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఏవో ఛాయాదేవిలు సంయుక్తంగా మహత్మ గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

కైకలూరు: కైకలూరులో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఈ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. కైకలూరులో గ్రామపంచాయతీలో చేపట్టే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామపంచాయతీలో నిర్వహించే విధులను వివరించారు. కళాజాత ద్వారా పంచాయతీలో జరిగే కార్యకలాపాలను వెల్లడించడంతో ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, టీడీపీ నాయకుడు వీరాబత్తిన సుధా, పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నూజివీడు బీజేపీ సత్కారం

నూజివీడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతిభావంతులను నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి ఆధ్వర్యంలో సత్కరించారు. పదవ తరగతిలో 596 మార్కులు సాధించి డివిజన్ ఫస్ట్‌గా నిలిచిన కుమార్‌స్కూల్ విద్యార్థిని డింపుల్ 594 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచిన త్రివిథ స్కూల్ విద్యార్థిని చరితశ్రీలను ఆమె సత్కరించి భరతమాత చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో విద్యార్థినిలు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.రాజశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు దద్దనాల రవికిషోర్, మల్లిఖార్జున జగదీష్, సూర్యప్రకాష్, మహిళా మోర్చా నాయకురాలు పద్మిని పాల్గొన్నారు.

హెచ్‌ఎం సాయిలక్ష్మికి సత్కారం

ముదినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం వాడవల్లి యూపీ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మిని పాఠశాల ఎస్‌ఎంసీ సభ్యులు, గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. ఆ పాఠశాల హెచ్‌ఎంగా 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ విద్యా సంవత్సరం చివరి పనిదినం రోజున ఆమెను సత్కరించి పాఠశాల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపునకు గత ఎనిమిది సంవత్సరాలుగా చేస్తున్న కృషిని కొనియాడారు.

యోగా పోటీలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): గొల్లపల్లిలోని అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా పోటీలు నిర్వహించినట్లు ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. గురువారం నాడు పాఠశాలలో జూనియర్ విభాగంలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీల్లో 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 8 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు.

క్యాన్సర్ రోగికి రూ.4లక్షల ఎన్‌వోసీ అందజేత

చాట్రాయి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన బండారి పుల్లమ్మ క్యాన్సర్‌తో బాధపడుతున్నది. ఈమెకు మెరుగైన చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి సాయం అందించాలని స్థానిక టీడీపీ నాయకులు హేమంత్‌కుమార్, చాగంటి రాధాకృష్ణ గృహ నిర్మాణశాఖ మంత్రిని కలిసి విన్నవించగా, వెంటనే స్పందించిన మంత్రి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.4లక్షలు ఎన్‌ఓసీని గురువారం టీడీపీ నాయకులకు అందజేశారు.

పేరూరు వంతెనపై రాకపోకలు బంద్

ముదినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పేరూరు గ్రామం వద్ద పోల్ రాజ్ మేజర్ డ్రెయిన్‌పై ఉన్న వంతెన మరింత ప్రమాద స్థితిలో పడింది. వంతెన శ్లాబు కూలిపోయిన సమయంలో నాలుగేళ్ల క్రితం గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న ఐరన్ ప్లేట్లు తుప్పు పట్టి విరిగిపోతున్నాయి. బుధవారం రాత్రి ఆ వంతెనపై నుంచి వెళ్తున్న ఒక ఆటో ఐరన్ ప్లేటు తుప్పు పట్టిన ప్రదేశంలో దిగబడి పోవటంతో కృంగిపోయింది. ప్రస్తుతం వంతెనపై నుంచి రాకపోకలు ఆగిపోయాయి. ద్విచక్ర వాహనాలు కూడ వెళ్లే పరిస్థితి లేదు. విరిగి కుంగిపోయిన ఐరన్ ప్లేటుపై నుంచి కాలినడకన వంతెన దాటేందుకు గ్రామస్థులు భయపడుతున్నారు.

విద్యార్థులు హైస్కూల్‌లో చేరాలంటూ ప్రచారం

ముదినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వైవాకలో కొత్తగా ఏర్పాటైన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి నుంచి ఈ ఏడాది తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ నుంచి అనుమతులు మంజూరైనట్లు మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ కుమార్ తెలిపారు. యూపీ స్కూల్ నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయిన ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటవుతాయని, 8 నుంచి 9వ తరగతిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని ఆయన గ్రామంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. గత రెండు రోజులుగా ఎంఈవో ఆ స్కూలు ఎస్‌ఎంసీ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులతో కలసి సమావేశాలు నిర్వహించి హైస్కూలును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైస్కూల్‌లో విద్యార్థులకు నూరుశాతం ఇంగ్లీష్ మీడియంలో సీబీఈ విధానంలో విద్యాబోధన జరుగుతుందని, స్మార్ట్ టీవీల ద్వారా విద్యాబోధన, లైబ్రరీ సౌకర్యం ఉంటుందని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



పోలీసు సేవలు అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

కైకలూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పోలీసులు సైతం సేవలు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం కైకలూరుటౌన్ పోలీసుస్టేషన్ వద్ద పోలీసుల ఆధ్వర్య ంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సచివాలయ మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కైకలూరుటౌన్, సర్కిల్ పరిధిలో పని చేస్తున్న పోలీసు, హోంగార్డు సిబ్బంది వారి పిల్లలు ఇటీవల పదో తరగతిలో అత్యుత్త మ ప్రతిభ చూపిన విద్యార్థులను ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అభినందించి ప్రత్యేక బహుమతులను అందజేశారు.

ఆర్‌జీయూకేటీ- మెటా గేట్ అవగాహనా ఒప్పందం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మెటలర్జీ ఇంజనీరింగ్ విభాగం దేశంలోని కొన్ని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలోనే ఉన్నది. ఆర్‌జీయూకేటీలో కూడా ఉండటం గర్వకారణమని ఆర్‌జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సండ్ర అన్నారు. ఆర్‌జీయూకేటీ మరియు హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మెటా గేట్ అకాడమీల మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ అవగాహన ఒప్పందంపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సండ్ర, మెటా గేట్ అకాడమీ డైరెక్టర్ ఎన్ గురుప్రసాద్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ మాట్లాడుతూ మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాలతో మెటల్స్ మెటీరియల్స్ విభాగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయన్నారు. ప్రస్తుతం ఆర్‌జీయూకేటీ మెటలర్జీ విభాగంలోని విద్యార్థులు 100 శాతం ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుంటున్నారన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



కలిదిండి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొండంగి గ్రామంలో తాగునీటి చెరువును ఎండగట్టడంతో నీటి సంఘం అధ్యక్షుడు ఇమ్మానేని చంద్రశేఖర్ ఆర్థిక సాయంతో వాటర్ ట్యాంకర్ల ద్వారా గ్రామస్థులకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. మంచినీటి చెరువును తాజా నీటితో నింపే వరకు సరిహద్దున ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా జువ్వలపాలెం నుంచి వాటర్ ట్యాంకర్ల ద్వారా గ్రామస్థులకు తాగునీరు సరఫరా చేస్తామని నీటి సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ తెలిపారు.

ఎంఆర్‌ఎఫ్ నూతన షోరూమ్ ప్రారంభం

నూజివీడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికతతో వీల్ ఎలైన్‌మెంట్ సేవలను ఎంఆర్‌ఎఫ్ టైర్స్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ రీజనల్ మేనేజరు వేణువర్గీస్ అన్నారు. నూజివీడులో ఎంఆర్‌ఎఫ్ ఆథరైజ్డ్ నూతన షోరూమ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రేణువర్గీస్ మాట్లాడుతూ దేశంలో అన్నివాహనాలకు అవసరమైన నాణ్యమైన టైర్లను ఎంఆర్‌ఎఫ్ ఉత్పత్తి చేస్తోందన్నారు. తమ సేవలను గ్రామీణప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. నైట్రోజన్‌తో నిండిన టైర్లు మెరుగైన స్థిరత్వం, భద్రత కలిగి ఉంటాయన్నారు. కొనుగోలు దారులకు వెంకటేశ్వర టైర్స్ డీలర్ హనుమంతరావుకు జిల్లా మేనేజర్ ఈశ్వర్ చేతులమీదుగా టైర్లను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

సినీ నిర్మాత అవార్డును దక్కించుకున్న సందేశ్



సందేశ్

ముదినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి) : దుర్గా ఆర్ట్స్‌అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కెవెల్ నారాయణ తన స్వగ్రామ మైన ముదినేపల్లి మండలం పెదగొన్నూరులోని కాజ లక్ష్మీ నారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రతి ఏటా పదవ తరగతి పరీక్షల్లో స్కూల్ ఫస్ట్ వచ్చే విద్యార్థికి ఇచ్చే నగదు అవార్డు ఈ ఏడాది ఉప్పరగూడెంకు చెందిన రెడ్డి సందీష్‌కు దక్కింది. ఈ విద్యార్థి టెన్త్ పరీక్షల్లో 600 మార్కులకు 573 మార్కులు సాధించి స్కూల్, మండల టాపర్‌గా కూడా నిలిచాడు. దీంతో సిని నిర్మాత ఇచ్చే రూ.5 వేల నగదు అవార్డును సందేష్ దక్కిం చుకున్నాడని హెచ్‌ఎం ఉదయ భాస్కర్ తెలిపారు.

హంపీకి మంత్రి సారథి అభినందనలు

నూజివీడు, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి):గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపీకి గృహనిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి అభినందనలు తెలిపారు. ఎఫ్ఐడిఈ, ఉమెన్స్ గ్రాండ్ ఫిక్స్‌లో చారిత్రాత్మక విజయం సాధించటం హంపీ చెస్ ఆటలో నిజమైన లెజెండ్ అని మరోసారి రుజువు అయిందన్నారు. హంపీ విజయం ప్రేరణగా నిలుస్తోందన్నారు. గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపీ మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని చదరంగం బోర్డుపై ఆమె ప్రతిభ ఇలాగే ప్రతిబింబిస్తూ ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

మలేరియా జ్వరంపై అవగాహన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం నూజివీడు బంగినపల్లితోట ఆరోగ్య కేంద్రలో నూజివీడు సబ్ యూనిట్ అధికారి ఎం యల్లమంద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యల్లమంద మాట్లాడుతూ మలేరియా జ్వరం లక్షణాలను వివరించారు. విపరీతమైన చలి జ్వరం, పిరియాడికల్‌గా జ్వరం, ఆకలి మందగించడం, నీరసం, రక్తహీనత, జ్వరము తగ్గిన వెంటనే చాలా ఎక్కువగా చెమటలు పడతాయన్నారు. ఆర్‌డీటీ కిట్ పరీక్ష ద్వారా మలేరియా జ్వరాన్ని నిర్ధారణ చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మంచినీటి నిల్వలపై పూర్తిగా మూతలు పెట్టాలన్నారు. నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలన్నారు. తలుపులకు కిటకీలకు నైలాన్ మెస్‌లను అమర్చుకోవాలని సూచించారు.

వేతనాల విడుదల పట్ల ఉపాధి కూలీల హర్షం

చాట్రాయి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు మూడు నెలల వేతనాలు గురువారం బ్యాంక్ ఖాతాలకు జమ కావడంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారు. వేతనాలు తీవ్ర జాప్యం జరగడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యారని, ఎట్టకేలకు ప్రభుత్వం కూలీల మొర ఆలకించి నగదు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం చెప్పారు.

హెచ్‌ఎం వాటాడ సాయిలక్ష్మి మృతి



సాయిలక్ష్మి (ఫైల్)

ముదినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి) : ముదినేపల్లి మండలం అల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాటాడ సాయిలక్ష్మి (54) మృతి చెందారు. చాలా కాలంగా అస్వస్థతతో ఉన్న ఆమె గురువారం ఉదయం మరణించారు. ఆమె భర్త ప్రసాద్ బొమ్మినంపాడు హైస్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు. హెచ్‌ఎం సాయిలక్ష్మి ఉపాధ్యాయురాలిగా అందరి అభిమానాన్ని చూరగొన్నారు. ఆమె మృతి పట్ల ఎంఈవో నరేష్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అల్లూరు ఎస్‌ఎంసి సభ్యులు, గ్రామస్తులు, సంతాపం తెలిపారు.

4 నుంచి వేల్పుచర్లలో ఫ్రెండ్స్ క్రికెట్

ముసునూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో వచ్చే నెల 4వ తేదీ నుంచి ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ యువనేత గరిముక్క నాని తెలిపారు. ఈ టోర్నమెంట్ రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి చేతులు మీదుగా ప్రారంభించడం జరుగుతుందని నాని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.33,333, రెండవ బహుమతిగా 22,222, మూడవ బహుమతిగా 9,999, నాలుగోవ బహుమతిగా 6,666 ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడాకారుల ప్రతిభను బట్టి ప్రత్యేక బహుమతులు సైతం అందజేస్తామన్నారు. క్రీడాకారులు ఒకే గ్రామానికి చెందినవారై ఉండాలని, ఆధార్ కార్డు తప్పనిసరి అన్నారు. జట్లు నమోదు చేసుకునేవారు 8374749236, 9502067912, 9866336886 నెంబర్లు సంప్రదించాలని నాని కోరారు.